కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ మంగళవారం 11 ఫిబ్రవరి 2025

సంపుటి: 14, సంచిక: 313 పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

ఏఐ సదస్సు..

ఫ్రాన్స్ చేరుకున్న ప్రధాని మోదీ

పారిస్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్‌కు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆ దేశ రాజధాని పారిస్‌లో అడుగుపెట్టారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ ..మిగతా 2లో

ఎన్‌కౌంటర్ మృతుల్లో ఐదుగురి గుర్తింపు

2

కుంభమేళాకు హాజరైన రాష్ట్రపతి

త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించిన ద్రౌపది

ప్రయాగరాజ్ ఫిబ్రవరి 10(నిఘా న్యూస్) ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహాకుంభమేళా లో రాష్ట్రపతి ..మిగతా 2లో

రంగరాజన్‌ను పలకరించిన రేవంత్

ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించిన ముఖ్యమంత్రి

అర్చకులు రంగరాజన్‌పై దాడి ఎంతో కలిచివేసింది : పవన్ కళ్యాణ్

అమరావతి ఫిబ్రవరి 10(నిఘా న్యూస్): చిలుకూరు బాలాజీ దేవస్థానం అర్చకులు ..మిగతా 2లో

ఏడాదిలోగా 20 లక్షల ఇళ్లకు...

సోలార్ విద్యుత్

బ్యాంకులు అంటే రుణాలు మాత్రమే కాదు, సాగులో కొత్త విధానాలను ప్రోత్సహించాలి

- అర్హతలున్న రైతులకు 15 నిమిషాల్లో రుణం అందజేయాలి
- రైతుల ఆత్మహత్యల నివారణకు మేదో మథనం జరగాలి
- ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఉద్యాన పంటలకు ప్రాధాన్యత
- హార్టికల్చర్, ప్రకృతి సాగుకు బ్యాంకులు మద్దతుగా నిలవాలి
- 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా అడుగులు
- బ్యాంకర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు వెల్లడి

అమరావతి ఫిబ్రవరి 10(నిఘా న్యూస్): స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రయాణంలో బ్యాంకులు భాగస్వాములు కావాలని ఎస్ఎల్‌బీసీ సమావేశంలో బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాల వ్యవహారంలో దర్యాప్తు సంస్థలకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'ప్రజల ఆహార అలవాట్లు చాలా మారాయి. అగ్రికల్చర్ స్థానంలో హార్టికల్చర్ వస్తోంది. హార్టికల్చర్, ప్రకృతి సాగుకు బ్యాంకులు మద్దతుగా నిలవాలని అన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు ఉండకూడదు. అన్నదాతల బాగు కోసం బ్యాంకులు, ప్రభుత్వం కలిసి పనిచేయాలి. ఎంఎస్ఎంఈ రుణాలను కేంద్రం సులభతరం చేసింది. గత ప్రభుత్వ ఆక్రమాలపై దర్యాప్తు సంస్థలకు బ్యాంకులు సమాచారం ఇవ్వాలి. పీఎం సూర్యఘర్ కింద ఏడాదిలో 20లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ లక్ష్యం' అన్నారు. ఎంఎస్ఎఈలకు రుణాలను కేంద్రం సరళతరం చేసిందని, అందుకు బ్యాంకులు ..మిగతా 2లో



డిపాజిట్ రాదనే పోటీ చేయని బీఆర్ఎస్

బీజేపీతోనే కేసీఆర్ లోపాయి కారి ఒప్పందం

ఎమ్మెల్సీ నామినేషన్లలో టీపీసీసీ విమర్శలు

కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు

హాజరైన పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు

కరీంనగర్ ఫిబ్రవరి 10(నిఘా న్యూస్): ప్రజాస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌ని అర్బన్ నక్సల్స్ అని ముద్ర వేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మతోన్మాదులు అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీజేపీ మతతత్వ ఎజెండాతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ కి తగిన గుణపాఠం చెప్పాలని అభ్యర్థిస్తున్నానని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరుతున్నాని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించాలని, గ్రాడ్యుయేట్లకు కాంగ్రెస్ ఎంతో మేలు చేసిందన్నారు. నాలుగు జిల్లాలో పెండిరగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, నాటి ప్రభుత్వాన్ని జీవన్ రెడ్డి గడగడలాడిరచారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి నామినేషన్ ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ..మిగతా 2లో

డేటా అనుసంధానం వేగవంతం చేయాలి

వాట్సాప్ గవర్నెన్స్‌లో మరిన్ని సేవలు.. ఆర్టీజీఎస్‌పై సమీక్షలో చంద్రబాబు

అమరావతి ఫిబ్రవరి10 (నిఘా న్యూస్): ప్రభుత్వ శాఖల మధ్య డేటా అనుసంధాన పక్రియ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..అన్ని శాఖల మధ్య ఉన్న డేటాను ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేసే పనుల్లో మరింత వేగం పెరగాలని సూచించారు. డేటా మొత్తం ఒక చోటుకు చేర్చి డేటాలేక్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, మెరుగ్గా అందించేందుకు ..మిగతా 2లో

ముగిసిన నామినేషన్ల ఘట్టం

భారీగా ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు

నేడు నామినేషన్ల పరిశీలన

కరీంనగర్ ఫిబ్రవరి 10(నిఘా న్యూస్): కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్లు వెల్లువెత్తాయి. ఇప్పటి వరకు 60కి పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం సాయంత్రంతో నామినేషన్ల దాఖల గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో దాఖల్కెన నామినేషన్లను మంగళ వారం పరిశీలించనున్నారు. అయితే ఈ నామినేషన్లు ఉప సంహరించు కోనే గడువు 13వ తేదీతో ముగియనుంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఆ ..మిగతా 2లో

నమ్మించి మోసం చేసిన కిరణ్ రాయల్

మంత్రి నాదెండ్లకునేను చెప్పిందే వేదవాక్కని

కోటి 20 లక్షలు.. 25 సబర్ల బంగారం కాజేత

మీడియా ముందు ఆధారాలను బయటపెట్టిన లక్ష్మి

ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలన్న లక్ష్మీరెడ్డి

తిరుపతి ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): సంసారాన్ని పోషించ డంతో పాటు మీకు అండగా ఉంటానని నమ్మించి ఆర్థికంగా నన్ను దెబ్బతీసి మోసం చేసిన దగాకోరు కిరణ్ రాయల్ అని బాధితు రాలు లక్ష్మీ రెడ్డి విమర్శించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కిరణ్ రాయల్ నుంచి తను దగా పడిన సంఘటనలకు సంబంధించిన వీడియోలను మీడియా ముందు ప్రదర్శించారు. తాను జనసేన పార్టీ నాయకు డిని తన బాస్ పవన్ కళ్యాణ్ అంటూ నాదెండ్ల మనోహర్‌కు నేను చెప్పిందే వేదవాక్కని నమ్మబలిగాడు. పవన్ కళ్యాణ్ తిరుపతిలో మీటింగ్ పెడుతున్నాడు మొత్తం నేనే చూసుకోవాలనీ ఆస్తి అమ్మ యినా డబ్బు కావాలని తనతో చెప్పాడు అన్నారు. అలా చేస్తే తనకు ఎమ్మెల్యే సీటు వస్తుందని ఎన్నికలు అయిన తర్వాత పవన్ కళ్యాణ్ డబ్బులు ఇస్తారని నువ్వు ..మిగతా 2లో

ప్యాలెస్‌లో కూర్చుని మాట్లాడితే.... ప్రభుత్వం జవాబు చెప్పాలంట!

మాజీ సీఎం జగన్‌కు అసెంబ్లీ నిబంధనలు తెలవక పోవడం బాధాకరం

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు శిక్షణ

శిక్షణ కార్యక్రామానికి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా రాక

అసెంబ్లీ రూల్స్ గురించి జగన్ తెలుసుకుంటే మంచిది

ఢిల్లీలో మీడియాకు వివరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 10(నిఘా న్యూస్): ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని వాటికి హాజరు కావాలని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కోరామని, అందుకు ఆయన సాను కూలంగా స్పందించారని ఎపి స్పీకర్ సిహెచ్ అయ్యన్న పాత్రుడు తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో కలిసి స్పీకర్ అయ్యన్నపాత్రుడు విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ వ్యవహార శైలీపై ఈ సందర్భంగా స్పందించారు. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని తాము నిర్ణయించామన్నారు. అయితే ఈ లోపే ..మిగతా 2లో

విద్యార్థులకు పరీక్షలే సర్వస్వం కాదు

నాలుగు గోడల మధ్య బంధించి

పుస్తకాల చెరసాలలో వేస్తే, వారు ఎప్పటికీ ఎదగలేరు

పరీక్షలను సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధం చేయాలి

తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒత్తిడి పెంచరాదు

పరీక్షాపై చర్చా కార్యక్రమంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్స్‌గా ప్రదర్శించవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించారు. పరీక్షలే సర్వస్వం కాదన్నారు. మనం రోబోలం కాదని, మనషులమని, ఒక దగ్గరే గిరిగీసుకొని ఉండొద్దని సూచించారు.'బయటినుంచి వచ్చే ఒత్తిడి మీద కాకుండా చదువుమీద దృష్టిపెట్టాలి. స్టేడియంలో వీక్షకులు కేకలేస్తూ, కేరింతలు కొడుతూ ఎంతగా శబ్దాలు చేస్తున్నా బ్యాటర్ దృష్టి మాత్రం బంతిపైనే ఉంటుంది. అలాగే విద్యార్థులు కూడా నేర్చుకోవడంపైనే దృష్టిపెట్టాలి' అని అన్నారు. కంటినిండా నిద్ర, సమతుల ఆహారం ముఖ్యమని, ఆరోగ్యాన్ని ..మిగతా 2లో

కుంభమేళాకు... రెండు రోజులు రావద్దండి

భక్తులకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి విజ్ఞప్తి

కుంభమేళాలాకు భారీగా భక్తుల తాకిడి

వందల కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు

ప్రయాగ్‌రాజ్ సంగం రైల్వే స్టేషన్ మూసివేత



2

కుంభమేళాకు హాజరైన రాష్ట్రపతి

మొదటి పేజీ తరువాయి...

ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి బయల్దేరిన ముర్ము, 10 గంటలకు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి యూపీ గవర్నర్ ఆనందీ బెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి మహాకుంభమేళా ప్రాంతానికి చేరుకున్నారు. త్రివేణీ సంగమ ప్రాంతంలో పడవలో విహరించారు. ఈ సందర్భంగా సంగమం వద్ద వలస పక్షులకు ఆహారం అందించారు. అనంతరం గంగా, యమునా, సర్వసతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించి గంగమ్మకు ప్రార్థనలు చేశారు. బడే హనుమాన్ ఆలయం, పవిత్రమైన అక్షయవత్ వృక్షాన్ని సందర్శించారు. అదేవిధంగా కుంభమేళా ప్రదేశంలో ఏర్పాటు చేసిన డిజిటల్ కుంభ్ అనుభవ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. జనవరి 13న పుష్య పౌర్ణమి సందర్భంగా మహాకుంభ్ మేళా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి పర్వదినం వరకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం కొనసాగుతుంది.%ఎ% ఇప్పటివరకూ 42 కోట్ల మందికి పైగా భక్తులు గంగానదిలో పవిత్రస్నానాలు ఆచరించారు. కాగా, ఈ నెల 5న ప్రధాని మోదీ కూడా కుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానమాచరించారు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో ఐదుగురి గుర్తింపు

చింతూరు ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): చత్తీస్గడ్ రాష్ట్రంలో ఆదివారం జరిగిన ఎన్కౌంటర్లో 30 మంది31 మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయింది పాఠకులకు విదితమే. ఈ మృతుల్లో 20 పురుషులు కాగా, 11 మంది మహిళలు ఉన్నట్లు బీజాపూర్ పోలీస్ ఉన్నతాధికారి జితేంద్ర యాదవ్ ప్రకటన విడుదల చేశారు. నేషనల్ పార్క్ ఏరియాలో మృతి చెందిన వారిలో అగ్ర నేతలను గుర్తించారు. వారిలో 8 లక్షల రివార్డు కలిగిన వెస్ట్ బస్తర్ డివ్యూటీ కమాండెంట్ హంగా, ఐదు లక్షల రివార్డు కలిగిన గంగలూరు నివాసి11 లాటోన్ కమాండర్ మందుల మంగు హేమ్లా, ఐదు లక్షల రివార్డు కలిగిన నేషనల్ పార్క్ ఏరియా కమిటీ అసిస్టెంట్ కమాండర్ ఒ యం సుభాష్, ఐదు లక్షల రివార్డు కలిగిన గంగలోర్ ఏరియా కమిటీ కమాండర్ సన్ను, రెండు లక్షల రివార్డు కలిగిన నేషనల్ పార్క్ ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు రమేష్ ఉన్నారని పేర్కొన్నారు.ఈ ఘటనలోఒక ఏ కె 47., యస్ యల్ ఆర్ 1, ఇన్సాస్ 303 రైఫిల్.1,315 బోర్ రైఫిల్, రాకెట్ లాంచర్ 1, బి జి ఎల్ లాంచర్లు 14, మజిల్ లోడింగ్ రైఫిల్లు 4, ఐఈడీలు 9, లేజర్ ప్రింటర్, పేలుడు పదార్థాలు, యూనిఫారంలు, మావోయిస్టు సాహిత్యం, రోజువారి ఉపయోగించే వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బస్టర్ ప్రాంతంలో శాంతి భద్రతలు , అభివృద్ధి కోసం అధికారులు పనిచేస్తున్నారని, అంకితభావంతో పనిచేసే అధికారులకు ప్రజల సహకరించాలని భాస్త ర్ డీఐజీ సుందర్ రాజ్ పేర్కొన్నారు. మావోయిస్టులు హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరఫున రావలసిన అన్ని సౌకర్యాలను అందిస్తామని తెలిపారు.

రంగరాజన్‌ను పలకరించిన రేవంత్

మొదటి పేజీ తరువాయి...

రంగరాజన్ పై దాడిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన అర్చకులు రంగరాజన్ ను ఫోన్ లో పలకరించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అలాగే రంగరాజన్‌పై ఒక మూక దాడి చేసిందని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. దురదృష్టకరమైన ఘటన ఇదని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. ఈ దాడిని ఒక వ్యక్తిపై చేసినట్లుగా కాకుండా– ధర్మ పరిరక్షణపై చోటు చేసుకున్న దాడిగా భావించాలని అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కొన్ని దశాబ్దాలుగా రంగరాజన్ ధర్మ పరిరక్షణకు, ఆలయాల వారసత్వ సంప్రదాయాలు, పవిత్రతను కాపాడేందుకు తపిస్తున్నారు, పోరాటం చేస్తున్నారని పవన్ కల్యాణ్ తెలిపారు. రామరాజ్యం అనే సంస్థ సభ్యులమని చెప్పి వెళ్లిన ఒక మూక రంగరాజన్‌పై దాడి చేయడం వెనుక ఉన్న కారణాలు ఏమిటో పోలీసులు నిగ్గు తేల్చాలని చెప్పారు. ఆ మూకను నడిపిస్తున్నది ఎవరో గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ దాడిని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం విలువైన సూచనలను రంగరాజన్ తనకు అందించారని తెలిపారు. టెంపుల్ మూమెంట్ అనే కార్యక్రమం ఏ దశలో ప్రారంభించాల్సి వచ్చిందో రంగరాజన్ తెలిపారని అన్నారు. హిందూ ఆలయాల నిర్వహణ, ధర్మ పరిరక్షణపై ఆయన ఎంతో తపన పడుతున్నారని చెప్పారు. రంగరాజన్‌పై చోటు చేసుకున్న దాడిని ప్రతి ఒక్కరం ఖండిరచాలని అన్నారు. చిలుకూరు వెళ్లి రంగరాజన్‌ని పరామర్శించి, అండగా ఉండాలని జనసేన పార్టీ తెలంగాణ విభాగానికి ఆదేశించారు. ఈ మేరకు రంగరాజన్‌కు భరోసా ఇవ్వాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

మొదటి పేజీ తరువాయి...

రోజు ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఈ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3వ తేదీన ఎన్నికల ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను మార్చి 8వ తేదీలోగా పూర్తి చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ దాఖలు గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో కరీంనగర్ – నిజామాబాద్ – ఆదిలాబాద్ – మెదక్ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ, నల్లగొండ – ఖమ్మం – వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీకీ ఇప్పటి వరకు మొత్తం 85 నామినేషన్లు దాఖల్కెనాయి. ఇక వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటి వరకు 17 మంది 23 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పీఆర్‌టీయూ బలపర్చిన అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డితోపాటు బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, టీజేఏసీ అభ్యర్థిగా హర్షవర్ధన్ రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ నామినేషన్‌ను వేశారు. అయితే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ దూరంగా ఉండడం గమనార్హం. తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ రెండు రాష్ట్రాల్లో మూడు, మూడు చొప్పున మొత్తం 6 ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది మార్చి 29వ తేదీన ఈ ఆరు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నిలకు అనివార్యమైనాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని అభ్యర్థులు ముమ్మరం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ పదవులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి.

విద్యార్థులకు పరీక్షలే సర్వస్వం కాదు

మొదటి పేజీ తరువాయి...

నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇతర పిల్లల్లాగే ఉండేలా చూడాలని, మీ పిల్లలు వారికి అత్యంత ఆసక్తి ఉన్న అంశాల గురించి చదివేలా చేయాలని మోదీ సూచించారు. పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పిల్లలతో ముచ్చటించారు. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఏటా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 8వ ఎడిషన్ పరీక్షా పే చర్చ వీడియోను సోమవారం ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. దిల్లీలోని సుందరవనంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎప్పుడూ ఒక పెద్ద హాల్‌లో పరీక్షలకు సంబంధించిన అనుమానాలు, ఒత్తిడి తట్టుకోవడం ఎలా అనే అంశాలపై సోదాహరణంగా వివరించే మోదీ, ఈసారి విభిన్నంగా విద్యార్థులతో ముచ్చటించారు. సుందరవనంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రధాని బదులిచ్చారు.పిల్లలు తమ ఆసక్తులను కూడా దృష్టిలో ఉంచుకోవాలని, అందరితో బహిరంగంగా మాట్లాడాలని, తల్లిదండ్రులు తమ సమస్యలను పిల్లలపై రుద్దకూడదని ప్రధానమంత్రి మోదీ అన్నారు. ప్రతి పిల్లలు ఏదో ఒక రంగంలో రాణిస్తారని అన్నారు.ఈ కార్యక్రమం కోసం 3.15 కోట్ల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, వారిలో 19.80 లక్షల మంది టీచర్లు, 5.20 లక్షల మంది తల్లిదండ్రులు ఉన్నారు. నేరుగా మాత్రం 36 మంది, మిగతావారంతా వర్చువల్‌గా పాల్గొన్నారు. 'ప్రతి విద్యార్థికి భిన్నమైన టాలెంట్ ఉంటుంది. కొంతమంది చదువులో ముందుంటారు. మరికొందరికి మంచి డ్రెస్సింగ్ స్టైల్ ఉంటుంది. విద్య సమగ్ర అభివృద్ధి కోసం ఉద్దేశించినది. విద్యార్థులు నాలుగు గోడలకే పరిమితం కాకూడదు. వారు తమ అభిరుచుల వైపు మళ్లేందుకు స్వేచ్ఛ అవసరం. పరీక్షలే సర్వస్వం అనే భావనలో జీవించకూడదు. పిల్లలకు సలహాలు ఇవ్వకూడదు. వారిలో ఎలాంటి నైపుణ్యాలు ఉన్నాయో గమనించాలి. వారిలో ఉన్న విశిష్టమైన ప్రతిభను వెలికితీయాలి' అని చిన్నారులు, టీచర్లకు మోదీ సూచించారు. ఈ సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌ను ప్రధాని ఉదహరించారు. 'సచిన్‌కు చదువు కంటే ఆటల మీదే ఆసక్తి ఎక్కువ ఉండేది. దాన్ని గుర్తించిన అతడి తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారని ప్రధాని గుర్తుచేశారు. 'సమయపాలన అన్నింటికంటే ముఖ్యం. రేపు మీరు ఏం చేయాలని అనుకుంటున్నారో ఒక కాగితం మీద రాసుకోవాలి. ఏ పని కోసం ఎంత సమయం వెచ్చించాలో ఆలోచించుకోండి. మీకు ఇష్టమైన సబ్జెక్ట్‌కు ఎక్కువ సమయం, ఇష్టం లేని దానికి తక్కువ సమయం కేటాయించొద్దు. దానికి భిన్నంగా చేయండి. కష్టమైన పాఠ్యాంశాన్ని ఒక సవాలుగా స్వీకరించండి' అని సలహా ఇచ్చారు. 'స్నేహితుల్లో మంచి లక్షణాలు గమనించండి. దానివల్ల ప్రతి పనిలో సానుకూలతను చూసే అలవాటు పెరుగుతుంది. ఇక స్నేహితుల కష్టాలను అర్థం చేసుకునేందుకు వారితో మాట్లాడండని అన్నారు. కేరళ నుంచి వచ్చిన విద్యార్థి ఆకాంక్షా ప్రధాని మోదీని హిందీలో పలకరించారు. దాంతో ఆశ్చర్యపోయిన ఆయన.. ఇంత చక్కగా హిందీ ఎలా నేర్చుకున్నావంటూ ప్రశ్నించారు. 'నాకు హిందీ అంటే చాలా ఇష్టం. నేనొక కవిత కూడా రాశా' అంటూ దానిని చదివి వినిపించారు. అలాగే మీరు ప్రధాని కాకపోయి ఉంటే ఏ మంత్రిత్వ శాఖ తీసుకుంటారని ఓ విద్యార్థి మోదీని అడిగారు. దీనికి ఆయన బదులిస్తూ 'నైపుణ్యాభివృద్ధి శాఖ అంటే ఆసక్తి' అని చెప్పారు. 'నైపుణ్యాలు చాలా ముఖ్యమైనవి కాబట్టి నేను నైపుణ్యాల విభాగాన్ని ఎంచుకుంటాను అని చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల నైపుణ్యాలపై దృష్టి పెట్టాలన్నారు. పిల్లలు అలసిపోతే పరీక్షల్లో బాగా రాయగలరా? అని అన్నారు. మనం రోబోలము కాదు, మనుషులం. పిల్లలను నాలుగు గోడల మధ్య బంధించి పుస్తకాల చెరసాలలో వేస్తే, వారు ఎప్పటికీ ఎదగలేరు అని ప్రధానమంత్రి అన్నారు. వారికి బహిరంగ ఆకాశం కల్పించాలని, స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యమని అన్నారు. పరీక్షల ఒత్తిడి నుండి విద్యార్థులను విముక్తి చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ కార్యక్రమం లక్ష్యం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారి ఒత్తిడి స్థాయిలను తగ్గించడం, వారు ఆరోగ్యంగా ఉండటానికి ప్రేరేపించడమే ప్రధాన ఉద్దేశం.

కుంభమేళాకు... రెండు రోజులు రావద్దండి

ప్రయాగ్‌రాజ్ ఫిబ్రవరి 10(నిఘా న్యూస్): ప్రయాగ్ రాజ్‌కు వెళ్లే రహదారులన్నీ ట్రాఫిక్ తో ఇబ్బంది పడుతుండడం వలన భక్తులు రెండు రోజులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కుంభమేళాలో భక్తుల తాకిడి కొనసాగుతోంది. కోట్లమంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు పోటెత్తుతుండడంతో వందల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో విపరీతమైన ట్రాఫిక్ వల్ల స్థానిక ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధిక రద్దీ కారణంగా ప్రయాగ్‌రాజ్ సంగం రైల్వేస్టేషన్‌ను శుక్రవారం వరకు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ మేళాకు వెళ్లే వారి సంఖ్య భారీగా పెరిగింది. జనసమూహం ఎంతగా ఉందంటే నగరమంతా ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతుంది. అటువంటి పరిస్థితిలో, ప్రయాగ్‌రాజ్‌లోని సంగం రైల్వే స్టేషన్ కూడా భారీ జనసమూహం కారణంగా మూసివేసినట్లు వార్తలు వచ్చాయి. దీనికి సంబంధించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి ప్రకటన వెలువడిరది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా సందర్భంగా 8 స్టేషన్లలో రైల్వే పనులు క్రమపద్ధతిలో జరుగుతున్నాయని ఆయన అన్నారు. దీనికోసం రాష్ట్ర పరిపాలన, న్యాయమైన పరిపాలనతో సహకారం, సమన్వయంతో పని జరుగుతోంది. ఆదివారం ప్రయాగ్‌రాజ్ జంక్షన్ నుండి 330 రైళ్లు బయలుదేరాయని ఆయన చెప్పారు. ఎక్కడా సమస్య లేదు. ఎవరైనా పుకార్లు వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తే, వాటిని పట్టించుకోవద్దని తెలిపారు. మహా కుంభమేళాకు ఊహించని రీతిలో భారీగా భక్తులు తరలివస్తున్నారు. కనీసం కాలు తీసి కాలు వేయలేనంతగా భక్తులు వస్తున్నారు. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తరలివచ్చారు. దీంతో వారణాసి, కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే మార్గాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఇక ఆదివారం సెలవు దినం కావడంతో ఊహించని విధంగా భక్తులు తరలి రావడంతో రహదారులన్నీ వాహనాలతో కిక్కిరిపోయింది. ఇలా దాదాపు 300 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. దీంతో భక్తులకు నరకం కనిపిస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మహాకుంభం ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు 44 కోట్ల మంది పుణ్య స్నానాలు ఆచరించారు.

డిపాజిట్ రాదనే పోటీ చేయని బీఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి...

ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, జిల్లా ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు షబ్బీర్ అలీ, జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ ఎన్నిక కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకమన్నారు. అనంతరం పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అన్ని కోణాల్లో నుంచి పరిశీలించి సత్తా ఉన్న నరేందర్ రెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేయడం జరిగిందని, కాంగ్రెస్ అంటే కమిట్మెంట్ పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ఇస్తామని చెప్పాము ఇచ్చామని, బీజేపీ తో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. డిపాజిట్ రాదనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, కేసీఆర్ ఏడాదికి 5వేల ఉద్యోగాలు ఇస్తే సీఎం రేవంత్ నెలకు 5వేల ఉద్యోగాలు ఇస్తున్నారన్నారు. ఖాళీలు భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, కేంద్రమంత్రిగా ఉండి బండి సంజయ్ రూపాయి కూడ తీసుకురాలేదన్నారు. బ్జడెట్‌లో తెలంగాణ రూపా యి పెట్టించలేని బీజేపీ నలుగురు ఎంపీ లు సమాధానం చెప్పాలని, కాంగ్రెస్ మాట నిలుపుకుంది కాబట్టి నరేందర్ రెడ్డి కి ఓటు వేయాలన్నారు. ఏడాది కాలంలో రేవంత్ రెడ్డి ,శ్రీధర్ బాబు రెండు లక్షల 30 కోట్లు పెట్టుబడులు తీసుకు వచ్చారని, ఏ ప్రభుత్వం కూడ చేయని కుల సర్వే చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. బీసీ కుల గణన చారిత్రాత్మకం . కాంగ్రెస్ చేసిన కుల గణన వల్లే 56శాతం బీసీలున్నట్లు తేలిందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్య

నమ్మించి మోసం చేసిన కిరణ్ రాయల్

మొదటి పేజీ తరువాయి...

ఇచ్చిన అప్పునంత ఇచ్చేస్తానని నమ్మించారన్నారు. ఫలితంగా తనను శారీరకంగా వాడుకోవడంతో పాటు తన వద్ద నుంచి కోటి 20 లక్షలు డబ్బుతో పాటు 25 సవర్ల బంగారు లాగేసుకున్నాడని వాపోయారు. ఇచ్చిన డబ్బును తన పిల్లల కోసం కావాలని అడిగితే తనపై అసత్య ఆరోపణలు చేస్తూ లేడీ కిలాడి అంటూ ఆరోపణ చేశాడన్నారు అంతేగాక నాతో పెట్టుకుంటే అందరిని చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అతని బెదిరింపులు తాళ లేక తాను ఆత్మహత్య చేసుకుంటే నైనా ఆ డబ్బులు తమ పిల్లలకు చెందుతుందని ఆలోచించానన్నారు. సఫలీకృతం కాకపోవడంతో తన ఆవేదనను మీడియా ముందు వెళ్ళబుచ్చే దానికి వచ్చానన్నారు. ముందుగా లేదని తనకు ఎవరు అండగాలేరని తన సొమ్ము కోసం తను ఒంటరిగా పోరాటం చేస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మహిళ పట్ల స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కిరణ్ రాయల్ నుండి తనకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

ఏడాదిలోగా 20 లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్

మొదటి పేజీ తరువాయి...

సహకరించాలన్నారు. గత ప్రభుత్వ అక్రమాలపై విచారణల్లో దర్యాప్తు సంస్థలకు బ్యాంకులు సమాచారం ఇవ్వాలి పిఎం సూర్యఘర్ పథకం కింద ఏడాదిలో 20 లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ లక్ష్యం ఎస్ఎల్ బిసి సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 10 సూత్రాల అమలుతో విజన్ కలను నిజం చేసేందుకు నిత్యం శ్రమిస్తున్నామని సిఎం అన్నారు. 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.వీటిలో కీలకమైన ప్రాథమిక రంగానికి బ్యాంకుల సహకారం ఎంతో అవసరమని సీఎం అన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఎక్కవ వృద్ధి సాధించే అవకాశం ఉందని దీనికి బ్యాంకుల నుంచి తగిన మద్దతు కావాలని సిఎం కోరారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయని.దీనికి అనుగుణంగా పంటల సాగు కూడా మారుతోందని అన్నారు. అగ్రికల్చర్ స్థానంలో హార్టికర్చల్ సాగు వస్తుందని దీన్ని దృష్టిలో పెట్టుకుని బ్యాంకులు హార్టికల్చర్ రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే ఆర్థికంగా బలోపేతానికి తోడ్పడే వాణిజ్య పంటల్ని సాగుచేసే రైతులకు బ్యాంకులు సాయపడాలన్నారు. అన్ని అర్హతలు ఉన్న రైతులు రుణం కోసం బ్యాంకుకు వచ్చిన 15 నిముషాల్లోనే రుణం ఇచ్చే పరిస్థితి రావాలని సీఎం అభిప్రాయపడ్డారు. అలాగే ప్రతి కుటుంబంలో రెండు మూడు పశువులు లేదా కొన్ని జీవాలు ఉంటే మంచి ఆదాయం వస్తుందని.డ్కెరీ6 రంగాన్ని పోత్సహించడం తమ విధానమని సీఎం అన్నారు. కొన్ని సందర్భాల్లో సరైన మార్కెట్ సదుపాయాలు, మద్దతు ధర రాక పంటలు పారబోసేపరిస్థితి వస్తోందన్నారు.దీన్ని నివారించేందుకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రొడక్ట్ ఫర్ ఫెక్షన్ పైనా తమ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని పంటలు, ఉత్పత్తులకు విలువ పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నాం అన్నారు. ప్రకృతి సేద్యం గేం ఛేంజర్ బ్యాంకులు అంటే రుణాలు మాత్రమే కాదు, సాగులో కొత్త విధానాలను ప్రోత్సహించేలా పనిచేయాలని సీఎం అన్నారు. పంజాబ్ వంటి రాష్ట్రంలో విపరీతంగా పురుగుమందుల వాడకం వల్ల క్యాన్సర్ బాధితులు పెరిగి వైద్యం కోసం ఢిల్లీ బాటపడుతున్నారని అన్నారు. ప్రకృతి సాగుతోనే వీటికి పరిష్కారం చూపగలం హార్టికల్చర్ సాగుతో పాటు ప్రకృతి వ్యవసాయానికి బ్యాంకులు మద్దతుగా నిలవాలి. రైతుల ఆత్మహత్యలు కనిపించకూడదురాష్ట్రంలో రైతుల ఆత్మహత్య మాటే వినిపించకూడదని అన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు అవసరమైన మార్గాన్ని అన్వేషిస్తున్నామని తెలిపారు. చనిపోయిన తర్వాత ఇచ్చే పరిహారం కంటే ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం, బ్యాంకర్లు ఏం చేయాలనేదానిపై ప్రత్యేకంగా మేధోమథనం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇకపోతే ఎంఎస్ఎఈలకు రుణాలను కేంద్రం సరళతరం చేసిందని, బ్యాంకులు ఈ విషయంలో మరింత చొరవ చూపాలని సీఎం అన్నారు. ఎంఎస్ఎంఈ లకు తగినప్రోత్సాహం ఇవ్వాలని, ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త అనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నామని అన్నారు. అది సాకారం కావాలంటూ చిరు వ్యాపారులకు రుణాలు సులభతరం కావాలి అని సిఎం అన్నారు.దర్యాప్తు సంస్థలకు సహకరించండి గత ప్రభుత్వ విధ్వంస పాలనలో అన్ని విభాగాలు, రంగాలు దెబ్బతిన్నాయని,వాటిని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామని దీనికి బ్యాంకుల సహకారం ఎంతో కీలకం అని సిఎం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆయా శాఖల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేస్తోందని, ఈ విచారణకు బ్యాంకు నుంచి కొంత సమాచారం కూడా అవసరం అవుతుందన్నారు. గత ప్రభుత్వ అక్రమాలపై విచారణలో బ్యాంకులు దర్యాప్తు సంస్థలకు సమాచారం ఇచ్చి సహకరించాలని సిఎం సూచించారు. ఏడాదిలో 20 లక్షల ఇళ్లకు సౌర విద్యుత్‌కేంద్ర పథకాలను అందిపుచ్చుకుని ప్రజలకు మేలు చేయాలనే సంకల్పానికి బ్యాంకులు మద్దతుగా ఉండాలని సిఎం అన్నారు. పిఎం సూర్యఘర్ పథకం కింద ఈ ఏడాది 20 లక్షల కుటుంబాలకు సోలార్ విద్యుత్ అందిచాలని లక్ష్యం విధించుకున్నామన్నారు. '2 కిలో వాట్ల వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ పరికరాలు అందిస్తాం. ఈ కార్యక్రమం అమలు ద్వారా అనూహ్య ఫలితాలు వస్తాయి. ప్రజలకు ఉపయోగపడే ఈ పథకం అమల్లో బ్యాంకులు కూడా భాగస్వామ్యం అవ్వాలి. ఈ పథకం ద్వారా ఉచితంగా తమ అవసరాలకు విద్యుత్ పొందడమే కాకుండా, తమ ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే విద్యుత్‌తో ప్రజలు ఆదాయం పొందే అవకాశం ఉంది' అని సిఎం అన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు రానున్నాయని వాటికి బ్యాంకులు రుణాలు ఇచ్చి సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ సీఈఓ మనిమేఖల్కె, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఏపీ అభివృద్ధిలో వ్యవసాయ, అనుబంధ రంగాలు గ్రోత్ ఇంజన్‌లుగా ఉన్నాయి. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 20 శాతం వృద్ధి సాధించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. గత ఏడాదితో పోలిస్తే కౌలు రైతులకు రుణాలు అందించడంలో పరిస్థితి మెరుగ్గా ఉంది. డ్రోన్ల వినియోగానికి బ్యాంకులు రైతులకు సహకారాన్ని అందించాలి. కౌలు రైతులకు సంబంధించి కొంతభూమిలో యజమానికి రుణం ఇచ్చినందున మిగతా భూమికి కౌలు రైతులకు రుణం ఇవ్వడం సాధ్యం కాదని బ్యాంకులు నిరాకరిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. కౌలు రైతులకు కూడా రుణాలు ఇవ్వాలని కోరుతున్నా అని అన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమైంది. పేద ప్రజల సంక్షేమానికి మరింత తోడ్పాటును అందించాలి. రాష్ట్ర పునర్నిర్మాణానికి బ్యాంకులు సహకరించాలని కోరుతున్నా. రైతులకు డ్రోన్లు అందించే కార్యక్రమానికి సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ప్రజలకు ఫైనాన్షియల్ లిటరసీపై పూర్తి అవగాహన కల్పించేందుకు బ్యాంకులు కృషి చేయాలి. హెల్త్ వెల్త్, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటులో భాగస్వాములు కావాలి' అని బ్యాంకర్లను కోరారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ ఎంపవర్మెంట్ శాఖమంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక కుటుంబం ఒక ఆంటప్రెన్యూర్ కార్యక్రమానికి బ్యాంకులు పూర్తిగా సహకరించ

హైదరాబాద్ బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులుగా లంకల దీపక్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను కలిసి సీనియర్ నాయకులు గౌతమ్ రావ్ సమక్షంలో శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపిన రంగా రెడ్డి జిల్లా బీజేపీ రాష్ట్ర నేత కొలన్ శంకర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో నాయకులు అదర్ల మహేష్, నర్సింగ్ గౌడ్, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

-బాలాపూర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్):

సర్దార్ పాపన్న విగ్రహానికి నివాళులు

మోకు దెబ్బ మండల అధ్యక్షుడు శ్రీనివాస్

కారేపల్లి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): కారేపల్లి బస్టాండ్ సెంటర్ లోని శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం స్థాపించి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కారేపల్లి గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ ఆధ్వర్యంలో పాపన్న విగ్రహానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. మండల గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ అధ్యక్షులు డాక్టర్ పోలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు కుల పెద్ద తాళ్లూరు చంద్రయ్య, డొంకెన రవీందర్, సీమలదారి సత్యనారాయణ, పాసిని నాగేశ్వరరావు, ఆరేళ్ల రవి, గడ్డమీద రామారావు, తోడేటి రమేష్, బోర్ల వెంకన్న, గాద సుబ్బయ్య, కాస్గాని రామారావు, సూరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జంటను ఆశీర్వదించిన నేతలు

ఎర్రబోడు మాజీ సర్పంచ్ కురసం సత్యనారాయణ

కారేపల్లి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): గార్ల మండలానికి చెందిన కుంజ నాగేశ్వరరావు-లక్ష్మి దంపతుల పుత్రిక స్పందన ఎర్రబోడు గ్రామానికి చెందిన పూణే బుచ్చు రాములు-రాంబాయి దంపతుల చిన్న కుమారుడు పూర్ణచంద్రరావు వివాహ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎర్రబోడు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కురుసం సత్యనారాయణ హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోసం సత్యనారాయణతో పాటు ఇరు గ్రామాల దొర6 పటేల్ పెద్దలు మహిళలు బాబు, నాగేశ్వరరావు, బిక్షం, రామారావు, శేఖర్, శ్రీను, వీరస్వామి, రాఘవులు, రాంబాబు, వెంకన్న,భద్రకాళి, వెంకటలక్ష్మి, స్వరాజ్యం, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మేనల్లుడు క్యాంప్ ఇన్చార్జి తంబూరి జన్మదిన వేడుకలు

కారేపల్లి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మేనల్లుడు మంత్రి క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి తంబురి దయాకర్ రెడ్డి జన్మ దిన వేడుకలను కారేపల్లి కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లెల నాగేశ్వరరావు తోగర శ్రీను డిగల ఉపేందర్ సురేందర్ మనియార్ గుగులోతు భీముడు ఎండి యాకుబ్ శేరు (మాజిద్ పాషా)ఆదర్ల రామారావు బోళ్ల రమేష్ గణేష్ సాగర్ బింద రమేష్ సౌండ్ వెంకటేశ్వర్లు నరేన్ పప్పుల నిర్మల మదన మల్లేష్ ఆరెళ్ళ రవి చక్రం నల్లపాడు శీను పవన్ అచ్చు భాన్సి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సూరారం కట్టమైసమ్మ జాతర

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కట్టమైసమ్మ అమ్మవారి జాతర సందర్భంగా సూరారం కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరికి తల్లి దీవెనలు అందాలి అని కోరుతూ యువజన నాయుకులు పూజలలో పాల్గొన్నారు. భగవంతుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రతి ఏడాదికి ఒక్కసారి జరిగే ఈ జాతరకు జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాని, ఎరుకల్ రాజు, వేణు విజయ్, గణేష్ వీరారెడ్డి, శివ కుమార్, అశోక్ సాయి, శాండి, పవన్ పాల్గొన్నారు.

విశ్వకర్మ మహిళలకు స్వయం ఉపాధిపై అవగాహన

హబ్సిగూడ, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ఆల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ మహిళా, యువజన ఫెడరేషన్ ఆధ్వర్యంలో హబ్సిగూడ రాంరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్లోనిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇంచార్జి పరమేష్ అన్ని విధాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు కోసం మేము అందరం కాంగ్రెస్ పార్టీ తరుపున కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వారికీ భూమి కూడా కేటాయించాలని, వారు అన్ని రంగాలలో రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారికీ అన్నివిధాలుగా ఆదుకుంటామని స్పష్టం చేశారు. సభ అధ్యక్షులు నాగలక్ష్మి, ఉపాధ్యక్షులు అవంతి, కోర్ టీం, ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ లీడర్ శ్రీనివాస్ చారి, నాయకులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్లను సన్మానించిన కాలనీ వాసులు

అమీన్ పూర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): అమీనుపూర్ మున్సిపాలిటీ 13 వార్డు పరిధిలోని మల్లారెడ్డి నగర్ కాలని, ఎస్.ఎల్.ఎన్. హోమ్స్ గణేష్ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన ఆత్మీయ సమావేశంలో కాలని వాస్తవ్యులు అమీనుపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.శశిధర్ రెడ్డి సతీమణి 13 వార్డు మాజీ కౌన్సిలర్ జి.లావణ్య దంపతులను ఎస్.ఎల్.ఎన్.హోమ్స్ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ రాఘవేంద్ర, ట్రెజరర్ నాగయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులు దీపక్, అభిషేక్, సత్యనారాయణ, సిద్ధ లింగ కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. శశిధర్ రెడ్డి, లావణ్య దంపతులు పదవీ కాలంలో 13 వార్డులో సిసి రోడ్లు, మంచి నీటి పైప్స్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వర్క్స్, తమ సొంత నిధులతో వార్డు పరిధిలో గణేష్ మండపాలు, కమ్యూనిటీ హాళు నిర్మించి 13 వార్డు ప్రజల అభిమానాన్ని పొందిన సందర్భంగా ఎస్.ఎల్.ఎన్. హోమ్స్ కాలనీవాసులు గెట్ టు గెదర్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎల్.ఎన్. హోమ్స్ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ వారు శశిధర్ రెడ్డి దంపతులను ఘనంగా శాలువాలతో సత్కరించి "ఆత్మీయ సన్మాన పత్రం" ముద్రించిన జ్ఞాపికను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని, ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కాలనీవాసుల గెట్ టు గెదర్ కార్యక్రమంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఎస్.ఎల్.ఎన్.హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ ఆతిథ్యానికి శశిధర్ రెడ్డి దంపతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొర్రెముల బాలాజీ నగర్ నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా బి.సుధీర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక

మేడిపల్లి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): పోచారం మున్సిపాలిటీ కొర్రెముల బాలాజీ నగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కాలనీ ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడిగా బి.సుధీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.సిద్ధార్, ఉపాధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, కోశాధికారిగా దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, సభ్యులుగా పి.లింగాచారీ, శరత్, పి.జానకి, ముఖ్య సలహాదారులు ఎం.మధుసూదన్ రెడ్డి, ఎం.ప్రభాకరరెడ్డి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బి.సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారి అభివృద్ధి, కాలనీలోని సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ పనులను పూర్తి చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తానన్నారు. కాలనీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నరేష్ చారి,కోటి రెడ్డి, నీలకంఠం, బద్రి నాథ్,మునీరుద్దీన్, మురళీకృష్ణ, అంజనేయులు, మహేష్, నరేష్ గౌడ్,ప్రవీణ్ చారి, నరేష్ రెడ్డి,వీరచారి, శ్రీనివాసరాజు,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో భరతనాట్య ప్రదర్శన

శంకర మఠం, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): శ్రీ శృంగేరి శంకర మఠం సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్, శ్రీ లాస్య నృత్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో భరత నాట్య నృత్య ప్రదర్శన శంకర మఠం వేదికపై ఆదివారం జరిగింది. యువ కళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నాట్య గురువు విశాఖ, శిష్యురాళ్లు భరత నాట్యమును కమణీయంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రామానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ కేంద్ర మంత్రి డా.సముద్రాల వేణుగోపాల చారి మాట్లాడుతూ మారుతున్న కాలంలల్లో స్త్రీలకు ధైర్య సాహసాలు కూడా అత్యవసరమని, కళా ప్రదర్శనలలో సంస్కారం ఉట్టి పడుతుందని అందుకు సహకరిస్తున్న వారిని అభినందించారు. ఈ సభలో ప్రముఖ న్యాయవాది కలగా పార్వతి ఆత్మీయ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. బుర్ర మోహన కృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భరతనాట్యం కార్యక్రమంలో భాగంగా శ్లోకాంజలి, గౌడ రాగం, మల్హరి, రాగాంశాలతో పాటుగా సరస వాణి, సరస్వతి, నటేష నవకం, దుర్గాదేవి, కళ్యాణి గీర్వాణి నక్షత్రమాలిక, గోవిందా హరి గోవిందా సంగీత సామ్రాజ్యం వంటి అంశాలను నయనానంద భరితంగా ప్రదర్శించారు. కళాకారులు. దృహిత, దుర్గ, తాన్వి, హర్షిని, అక్షయ, సంకీర్తన, ప్రణవి, మేధ, ఆద్య, అనఘ, మహతి, శ్రియ, కార్తీక, శ్రీహిత, నయన, రిధీమా, చక్కని హావాభావాలు ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు. నృత్య గురువు విశాఖ కళాకారులకు జ్ఞాపికలు బహుకరించి ఘనంగా సత్కరించారు. శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి, కన్వీనర్ రఘు శ్రీ సభ సమన్వయం గావించారు.

ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిలబెట్టు కోవాలి

ఇళ్ల స్థలాల కోసం సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం తాసిల్దార్ కార్యాలయం ముందు నిరుపేదలక..? ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చినటువంటి హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మేము అధికారంలోకి వస్తే గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. స్థానిక తహసిల్దార్ కు వినతిపత్రం తోపాటు పేదల అర్జీలను ఇవ్వడం జరిగింది ఈ అర్జీలపై సమగ్ర విచారణ జరిపి ప్రతి నిరుపేద కుటుంబానికి మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని, ఇల్లు ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని హౌసింగ్ కి ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీనివాసులు ప్రజానాట్యమండలి జిల్లా నాయకురాలు చారుశీల మండల నాయకులు నరసయ్య సిపిఐ గురవయ్య గోపి తడుతురులు పాల్గొన్నారు.

నర్సాపూర్ ఎక్స్ రోడ్ తుప్రాన్ లో ఐవీఎఫ్ మెడక్ జిల్లా ప్రెసిడెంట్ ఉప్పల నర్సింహులు, డాక్టర్ ఉప్పల సాయి వెంకటేష్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి చిల్డ్రన్ హాస్పిటల్ నీ గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి తుముకుంట నర్సారెడ్డితో కలిసి ప్రారంభించిన టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్న పిల్లలకి అన్ని విధాలా వైద్యం అందించాలని డాక్టర్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, ఐవిఎఫ్. రాష్ట్ర కోశాధికారి నారాయణ గుప్త, నరేష్ గుప్త, శ్రీధర్, ఐ.వి.ఎఫ్.నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

-తూప్రాన్ ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్):

38వ జాతీయ క్రీడల భాగస్వామిగా క్లియర్ ప్రీమియం వాటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): గత నెల 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖండ్ లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడలకు క్లియర్ ప్రీమియం వాటర్ ను అధికారిక భాగస్వామిగా నియమించారని క్లియర్ ప్రీమియం వాటర్ ఫౌండర్, సీఈఓ నయన్ షా సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ డెహ్రాడూన్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రధాని నరేంద్ర మోడీ ఈ క్రీడలను ప్రారంభించినట్లు తెలిపారు. ఉత్తరాఖండ్ క్రీడా మంత్రి రేఖా ఆర్య, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి ఉష తదితరులు పాల్గొన్నట్లు చెప్పారు. పర్యావరణ సుస్థిరత దిశగా ఒక మార్గదర్శక చర్యగా, క్లియర్ ప్రీమియం వాటర్ ఈ ఈవెంట్ కోసం భారత దేశపు మొదటి 100 శాతం ఆర్పిఇటి బాటిల్ శ్రేణిని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ చొరవ గేమ్స్ యొక్క 'గ్రీన్ గేమ్స్' నినాదానికి అనుగుణంగా ఉంటుందన్నారు. పర్యావరణ అనుకూల పద్ధతులకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

ఇల్లందులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇల్లందు, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ఇల్లందు పట్టణ మెయిన్ రోడ్డు హైస్కూల్ లో పదవ తరగతి చదువుకున్న 2006-07 బ్యాచ్ పూర్వ విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ రిత్యా స్థిరపడిన నాటి పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. దాదాపు 18 సంవత్సరాల తర్వాత ఆత్మీయ తమకు విద్య నేర్పిన గురువులను ఆహ్వానించి వారితో చదువుకున్న సమయంలో జరిగిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారు చదువుకున్న సమయంలో జరిగిన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సలీమ్, జ్యోతి, కళ్యాణి, రూప, నరేష్, షాహిన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

శ్రీకాళహస్తి ఆర్టీసి డిపో అసిస్టెంట్ మేనేజర్ చిట్టెమ్మ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ చిట్టెమ్మ అన్నారు. ఆర్టీసీ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ది స్కూల్ నందు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం, అధిక వేగం, ఓవర్ లోడ్ అనేవి రోడ్డు భద్రతకు ప్రమాద హేతువులని, రహదారి భద్రతా సూత్రాలు పాటించడం ద్వారా సురక్షిత జీవితాన్ని గడపవచ్చని అన్నారు. విజేతలైన విద్యార్థులకు కరస్పాండెంట్ జనార్దనరావు జె.పవార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి డిపో సూపరింటెండెంట్ మారయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణపేటలో పోలీసుల ప్రజావాణి

నారాయణపేట, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుండి ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సీఐ,ఎస్ఐ లకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకొవచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్ లో ఉండరాదని వాటిని వెంటనే పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

మేడ్చల్ జిల్లా టియుడబ్ల్యూ జే యూనియన్ జర్నలిస్టు డైరీని సోమవారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

-ఉప్పల్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్):

శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం

రామంతాపూర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): రామంతాపూర్ శ్రీనివాసపురంలోని శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి దేవాలయ కమిటీ (ధర్మకర్తలకు) శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ ఛైర్మన్ కంది ఆగి రెడ్డి, సభ్యులుగా నాగారం శ్రీనివాస్ చారి, సంపత్, వేం యాకుబ్ రెడ్డి, చేవేళ్ల మల్లయ్య కురుమ, నాగరాజ్, శ్రీవాణి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఆంజనేయులు, కంది శ్రవణ్ రెడ్డి, ఆకారపు అరుణ్ పటేల్, విజయ్ కుమార్ పేట మురళి ముదిరాజ్, మార్తం ఉపేందర్ రెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్ బాబు,సాగ శ్రీధర్ సతీష్ గౌడ్ ధర్మేంద్ర నాయక్ రాఘవేందర్ వాసు నాయక్ బిళ్ళకంటి యాదయ్య, మల్లేష్, రఘు, ప్రకేష్, కిషోర్, భాను, నాగచారీ, భాస్కర్, చోట, పాషా, సంజీవ్, చైతన్య, శివ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బంగారు పథకాలు

మేడ్చల్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ఈ నెల 9వ తేదీన సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగినటువంటి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీలలో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 కరాటే అకాడమీ విద్యార్థిని విద్యార్థులు ఐదుగురు బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా అండర్ 12 ఇయర్స్ ఫైట్ క్యాటగిరిలో పి.చైతన్య గ్రాండ్ ఛాంపియన్షిప్, అండర్ 14 ఫైట్ కేటగిరిలో వీరభద్ర గ్రాండ్ ఛాంపియన్షిప్ సాధించడం జరిగింది. వీరందరినీ కరాటే అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఘరదాసు నరేందర్, కమిటీ మెంబర్స్ విద్యార్థిని విద్యార్థులను ఘనంగా సన్మానించారు. మేడ్చల్ పట్టణానికి చెందిన విద్యార్థిని విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఆడి బంగారు పతకాలు సాధించినందుకు రాబోయే రోజుల్లో ఎక్కడ ఎలాంటి టోర్నమెంట్స్ జరిగిన తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని యూనివర్సల్ 369 ఫౌండర్ సాయికుమార్ తెలిపారు.

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల పర్వం

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గం నామినేషన్ల ఘట్టం సోమవారం తో ముగిసింది. ఈనెల 11న పరిశీలన 13న ఉపసంహరణ ఉంటుంది. అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ స్వీకరించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఆఖరి రోజు రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులు పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసులు రావు ఆఖరి రోజు నామినేషన్ దాఖలు చేశారు.

బిఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

అబ్దుల్లాపూర్ మెట్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని వైఎన్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం అబ్దుల్లాపూర్ మెట్ మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర పార్టీ నాయకులు క్యామ మల్లేష్ హాజరైనారు. సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, మండల, గ్రామాల స్థాయిలో పార్టీని మరింత అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా, పార్టీ విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి శూన్యమని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే ప్రజల కళ్ళముందు ఉందని అవి ప్రతి ఒక్క కార్యకర్త ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పార్టీకి చెందిన ప్రతీ కార్యకర్త సమష్టిగా కృషి చేస్తే, భవిష్యత్తులో మరింత విజయవంతమైన సేవలు అందించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్, నాయకులు లెక్కల విఠల్ రెడ్డి, సోముల జగదీష్, కందాడి కృష్ణారెడ్డి పూజారి చక్రవర్తి, చెరుకు కిరణ్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎంపిటిసి, జెడ్పి టిసి, గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయిలో ఏవో ఎపివో పివో తో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ , ఎంపిటిసి, జెడ్పి టిసి సర్పంచ్ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్ లు మౌలిక వసతుల ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ ఓ లకు, ఏ ఆర్ ఓ లకు, పి ఓ లకు, ఏ పి ఓ లకు మాస్టర్ ట్రైనీలచే శిక్షణ ఇవ్వడం జరుకుతున్నదని, పేర్కొన్నారు. శిక్షణలో నియమ, నిబంధనలపై పూర్తి అవగహన చేసుకోవాలని తెలిపారు. ఎక్కడ ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తుచ తప్పకుండా పాటించాలని సూచించారు. ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి అవసరం ఉందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్.ఓలు నోటిఫికేషన్ జారీ చేసి, ఆ రోజు నుండే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నోటిఫికేషన్ లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ లో అభ్యర్థుల పేర్లను అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని, ఓటరు జాబితాలోని పేరును అక్షరక్రమం కోసం పరిగణలోకి తీసుకుంటే ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామినేషన్ల దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని అన్నారు. ఈ నెల 11 తేదీన ఆర్ ఓ లకు, ఏ ఆర్ ఓ లకు జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి డివిజన్లలోనూ, 12,13 తేదీలలో పి ఓ లకు, ఏపిఓ లకు ఆయా మండల ప్రధాన కార్యాలయాలలోను, 15 తేదీన ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల నిర్వహణ కోసం శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ సంగమేశ్వర్ నామినేషన్ల ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సమీక్ష సమావేశం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జడ్పీసీఈఓ జానకిరెడ్డి, డిపిఓ సాయిబాబా, ఎన్నికల నోడల్ అధికారులు, రెవెన్యూ డివిజినల్ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో వాడవాడల సీసీ కెమెరాల ఏర్పాటు

పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ధర్మారం మండలం పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ధర్మారం ఎస్.ఐ. శీలం లక్ష్మణ్ ఆధ్వర్యంలో వ్యాపార, వాణిజ్య వర్గాలు,కుల సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ధర్మారం పట్టణమంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దొంగతనాల నివారణ కోసం సీసీ కెమెరాలు ఎంతో అవసరమని, త్వరితగతిన నిందితులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఒక్కో సిసి కెమెరా 100 మందితో సమానమని, దినదినాభివృద్ధి చెందుతున్న ధర్మారం పట్టణ శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని ప్రతి వాడలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మంచి నిర్ణయం తీసుకున్న ధర్మారం ఎస్ఐ శీలం లక్ష్మణ్, కానిస్టేబుల్ రజనీకాంత్ లను సిఐ అభినందించారు. సీసీ కెమెరాల ఏర్పాటులో ముందుకు వచ్చిన వ్యాపార, వాణిజ్య వర్గాలు, కులసంఘాల వారిని సిఐ అభినందించారు. వారం పది రోజులలో ధర్మారం పట్టణంలో 50

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని సీఐ తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ఆయా గ్రామాల ప్రజలు ముందుకు వచ్చి నేరాల నియంత్రణలో సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్థరణను అడ్డుకున్న బాధితులు

- నోటీసులు ఇవ్వకుండా కూల్చడం పై బాధితుల ఆందోళన
- తమ ఇండ్లకు నష్టపరిహారం ఇవ్వాలని వినతి
- మీడియాపై జులుం ప్రదర్శించిన కాంగ్రెస్ లీడర్

మద్దూర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): నారాయణపేట జిల్లా మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల లో రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న బాధితులు సోమవారం పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నోటీసులు కూడా ఇవ్వకుండా తమ ఇండ్లను జేసీబిలతో ఎలా కూల్చేస్తున్నారని పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ పై మండిపడ్డారు. అభివృద్ధిని అడ్డుకునేది లేదని కొందరు కాంగ్రెస్ నేతలు భాదితులతో కాసేపు వాగ్వాదంపెట్టుకున్నారు. దీంతో బీజేపి మండల అధ్యక్షుడు శంకర్ తో కలిసి కాసేపు ఆందోళన చేశారు.భాదితులకు చెప్పకుండా కాంగ్రెస్ నేతలు దౌర్జన్యం చెలాయిస్తున్నారని ఇండ్లు,దుకాణాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిన తర్వాతనే పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం తెలిసిన మీడియా అక్కడికి చేరుకోగా భాదితులు తమ గోడును వినిపించి ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫోటోలు తీస్తున్న రిపోర్టర్లపై దురుసుగా ప్రవర్తించారు. అదే గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ లీడర్, న్యూస్ కవరేజ్ కోసం వచ్చిన రిపోర్టర్లకు ఫోన్ చేసి ఫోటోలు వీడియోలో తీయడానికి ఎందుకు వెళ్లారు అంటూ, మీడియాపై జులుం ప్రదర్శించాడు. ఇట్టి విషయంపై ఇంచార్జ్ మున్సిపల్ కమీషనర్ నాగరాజు కు వివరణ కోరగా పంచాయతి రాజ్ ఏఈ, పీఆర్ ఓలతో చర్చించి వారికి న్యాయం చేసేల కృషి చేస్తామని తెలిపారు.

టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు ఉద్యోగాలు

టిడిపి నేత పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పాకాల మండలంలో నాలుగవ రోజు బైనపల్లి, ఉప్పరపల్లి పంచాయతీలలోని సోమవారం మహిళతో ముఖాముఖి కార్యక్రమం టిడిపి నేత పులివర్తి సుధారెడ్డి నిర్వహించారు. మహిళలతో ముఖాముఖి కార్యక్రమానికి పాకాల జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణమనేని సావిత్రి,ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, మీనా, రోజా పాల్గొన్నారు. మహిళలతో ముఖాముఖి కార్యక్రమానికి విచ్చేసిన టిడిపి మహిళా నేత పులివర్తి సుధారెడ్డికి మహిళలు ఘన స్వాగతం పలికారు.బైనపల్లి గ్రామంలో వెలసిన గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేసి,అనంతరం స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళు లర్పించారు. ఎన్టీఆర్ అమర్ రహే అని నినాదాలు చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి మహిళలతో మొదటి విడత నాలుగో రోజు మహిళలతో ముఖాముఖి కార్యక్రమం చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, పంచాయతీలలో ఉన్న ఇతర సమస్యలను తెలుసుకుంటూ,మహిళల పొదుపు సంఘాలతో ఏ విధంగా ఆర్థికంగా ఎదగవచ్చునో తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కాక పంచాయతీలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణమే పరిష్కరించే విధంగా స్థానిక నేతలు, అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్

ముందు చూపుతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని, అనే ఉద్దేశంతో ముందుకు కుటమి ప్రభుత్వం వెళ్తుందని తెలియజేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో మహిళలకు స్వయం ఉపాధి కేంద్రంలో బ్యాగ్ ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహిళలకు స్వయం ఉపాధి కింద ఉచిత టైలరింగ్,స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు, మరెన్నో గొప్ప అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీలోని సమస్యలు డ్రైనేజ్,వాటర్ ట్యాంక్,ఇంటి పట్టాలు, సీసీ రోడ్, కమ్యూనిటీ హాల్ ఇతర సమస్యలను మహిళా నేత పులివర్తి సుధారెడ్డికి వివరించారు. అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలాగా చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కిరణ్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, బుజ్జి నాయుడు, భరత్, కిరణ్, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

19 టన్నుల పిడిఎస్ రైస్ పట్టుకున్న పోలీసులు

ఉప్పల్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): రాజస్థాన్ కు తరలిస్తున్న పిడిఎఫ్ రైస్ గలఓ లారీని ఉప్పల్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం ఉప్పల్ లోని జెర్సీ కంపెనీ ఎదురుగా గల పార్కింగ్ ప్లేస్ లో రాజస్థాన్ రాష్ట్రానికి అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న పిడిఎస్ రైస్ లారీ నెంబర్ (ఏపీ 20 జిబి 5579)ని ఉప్పల్ పోలీస్ స్వాధీనం చేసుకున్నారు. అందులో దాదాపు 19 టన్నుల (సుమారు 400 రైస్ బ్యాగ్స్)

ఉన్నాయి. లారీ డ్రైవర్ మహమ్మద్ అష్జల్, సహాయకుడు గొట్టుముక్కల విలేజ్ కు చెందిన ఎరకల జంగయ్య ను అదుపులోకి తీసుకున్నారు. పిడిఎస్ రైస్ పట్టుకున్న ప్రతిసారి విచారణ జరపకుండా వదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పట్టుకున్న ప్రతిసారి ఎవరు సప్లై చేస్తున్నారన్నా విషయాన్ని పోలీసులు స్పష్టం చేయకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బండారి పద్మకు నివాళు లర్పించిన స్పీకర్, హరీష్ రావు

సైనిక్ పురి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): అనారోగ్యంతో

మరణించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వదిన బండారి పద్మ పార్థివ దేహానికి సైనిక్ పురి లోని తన నివాసంలో సందర్శించి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందులో క్రికెట్ పోటీలు ప్రారంభం

ఇల్లందు, ఫిబ్రవరి 12 (నిఘా న్యూస్): ఇల్లందు పట్టణంలో పరశు రాం యూత్ ఆర్ అండ్ ఆర్ కాలనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖమ్మం వరంగల్ నల్గొండ ఉమ్మడి జిల్లాల బొగ్గుట ప్రీమియర్ లీగ్ కేకే ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ మూడవ రోజులో భాగంగా. ఈరోజు రెండు జట్ల మధ్య టాస్ ని వేసి టోర్నమెంట్ ను ప్రారంభించిన ఇల్లందు మాజీ మున్సిపల్ వైస్ చైర్పర్సన్ మడత వెంకట్ గౌడ్. ఈ కార్యక్రమంలో వారితోపాటు మడత అభిమానులు ఏక్తా హౌస్ టీం సభ్యులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ వంశీకృష్ణ జన్మదిన వేడుకలు

ధర్మపురి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ధర్మారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కేక్ కట్ చేసి ఎంపీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, ధర్మపురి నియోజవర్గ యూత్ అధ్యక్షులు యశోద అజయ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంపెల్లి రాజేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవి జనార్ధన్, ఒరెం చిరంజీవి,దేవి కిషోర్, దేవి అఖిల్, పొన్నవేణి స్వామి, బొంగణి సత్తన్న,కాంశాని ఎల్లయ్య, తుమ్మల తిరుపతి, జేరిపోతుల రజినీకాంత్, జెరిపోతుల కిరణ్, పొన్నం కిట్టు, కుమార్, గొడుగు బన్నీ,శేఖర్,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశంలో మద్యపానం నిషేధం

డిఎస్పి నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని డిఎస్పి నరసింహమూర్తి శ్రీకాళహస్తి పట్టణ ప్రజలను కోరారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు సోమవారం శ్రీకాళహస్తి పట్టణం స్వర్ణముఖి నది కరకట్ట మీద ఉన్న ప్రదేశంలో పారవేసిన ప్లాస్టిక్ వ్యర్థ పదార్థములను, కాళీ మద్యం సీసాలను మునిసిపల్ సిబ్బంది సహాయంతో సేకరించి వాటిని అక్కడే కాల్చివేసి అక్కడ ఎవరు మద్యం సేవించకూడదు అనే ఒక హెచ్చరిక బోర్డును కూడా పెట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సబ్ డివిజనల్ డి.ఎస్.పి.నరసింహమూర్తి అధ్వర్యంలో ఒకటవ పట్టణ సీఐ గోపి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముజీబ్ ఖాన్ సేవలు అభినందనీయం

రాష్ట్ర చీఫ్ విప్ మహేందర్ రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ముస్లిం సంక్షేమానికి కృషి చేస్తున్న ముజీబ్ ఖాన్ సేవలు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే బి మనోహర్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి ముజీబ్ ఖాన్ సేవలను అభినందించారు. ఇమామ్, మోజంల భూ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తాండూరు పట్టణ కేంద్రంలోని సాయిపూర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముజీబ్ ఖాన్ సేవా దృక్పథంతో ఇమామ్, మోజంలకు సొంతంగా ఇంటి నిర్మాణానికి భూమి ఇస్తుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా ముస్లిం సోదరులు దేవుని ప్రార్థన చేసుకోవడానికి సాయిపూర్లో నూతనంగా మజీద్ నిర్మాణం చేయడం సంతోషకరమైన విషయమని, ముజీబ్ ఖాన్ సేవలను కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అనునిత్యం మైనార్టీ సంక్షేమానికి కృషి

చేస్తున్నారన్నారు. ముజీబ్ ఖాన్ కోరినట్లుగా 10 నుండి 12 ఎకరాల స్థలాన్ని వారికి కేటాయించే విధంగా ముందుకు వెళ్తామన్నారు. మైనార్టీ కళాశాల నిర్మాణానికి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే దీనికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని అందజేస్తామన్నారు. తాండూరు హైదరాబాదు రహదారి పునర్నిర్మాణం చేస్తామన్నారు. తాండూరు నియోజకవర్గానికి 35 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరిగిందన్నారు. ఇమామ్, మోజంలకు ఇందిరమ్మ పథకంలో ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. కొడంగల్ తరహాలో తాండూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. కాలుష్య రహిత తాండూరు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. తాండూరులో డయాలసిస్ స్థాయిని పెంచుతామని వెల్లడించారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు తలెత్తిన తాండూరు నియోజకవర్గం అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడమే కాకుండా ప్రత్యేక నిధులను మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వక్స్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ని, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సదర్ కమల్ అత్తర్, మాజీ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఖుర్షిద్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన్, తాండూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హబీబ్ లాలా, ఇబ్రహీం ఖాన్, ఫరీద్ అడ్వకేట్, ఇమామ్, మౌజంలు, తదితరులు పాల్గొన్నారు.

జల్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని మాదన్న గూడ అటవీ ప్రాంతంలో వెలిసిన ప్రసిద్ధమైన గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారి జాతర సందర్భంగా రంగారెడ్డి జిల్లా బిజెపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ శాంత కుమార్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి విఠల్ బాబా, నాయకులు ప్రేమ్ కుమార్, శేఖర్ బాబు పాల్గొన్నారు.

-పహాడీషరీఫ్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్):

ప్రాణ ప్రతిష్టకు సిద్ధమవుతున్న కోటి లింగేశ్వరుడు

- కాతేరులో తయారవుతున్న కోటిలింగేశ్వరుడు తయారీ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన వేయించేసి ఉన్న శివ కేశవుల ఆలయం వద్ద ఫిబ్రవరి 12వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరగనున్న శివ కేశవుల ప్రతిష్ట మహోత్సవంలో కోటి పార్థివలింగాలు నిక్షిప్తమైన ప్రదేశంలో ప్రతిష్టించే కోటిలింగేశ్వరుడి విగ్రహం తయారీ కాతేరులోని శిల్పి రామలింగాచార్యులు చేతుల మీదుగా తయారవుతున్న కోటిలింగేశ్వరుడు విగ్రహ తయారీని పరిశీలించిన జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ. జగ్గంపేట మండలం ఇర్రిపాక తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం

గోకవరం, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): గోకవరం మండలం నందు కొత్తపల్లి పి.హెచ్.సి పరిధిలో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్,ఉన్నత పాఠశాలలు, కళాశాలలు నందు అంగన్వాడీ స్కూల్స్ లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గోకవరం మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ గౌరమ్మ ఆధ్వర్యంలో జి.కొత్తపల్లి వైద్యాధికారి డా.నిఖిత సమక్షంలో విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెన్ డాజోల్ మాత్రలు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో డా.నిఖిత విద్యార్థులకు డివార్మింగ్ డే ఆవశ్యకత, అనీమియా, హ్యాండ్వాష్ వంటి అంశాలమీద అవగాహన కల్పించారు. ఎమ్.ఈ.ఓ గౌరమ్మ ఈ మాత్రలు అందరు వేసుకోవాలని ఈ రోజు వేసుకోని వారు మళ్ళీ 17 న జరిగే మాపప్ రౌండ్ లో వేసుకోవాలన్నారు. సోమవారం నాటి డి వార్మింగ్ డే లో మండలం మొత్తము మీద 94 శాతం వేసుకొన్నారని కొత్త పల్లి పి హెచ్ సి ఆరోగ్య విస్తరణాధికారి డి.ఎన్.మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమం హై స్కూల్ హెచ్ఎమ్ పి.సత్యనారాయణ రెడ్డి, ఎమ్.పి.హెచ్.ఈఓ శంకర్, అనూష, పవన్, రమణ, శ్రీదేవి, రాణి హై స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

శీలధి గ్లోబల్ స్కూల్లో కలర్స్ డే

కోరుకొండ, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): కోరుకొండ శీలధి గ్లోబల్ స్కూల్ లో పర్పుల్ కలర్స్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పర్పుల్ కలర్ డ్రెస్సులతో ఆకట్టుకున్నారు. పర్పుల్ కలర్ వస్తువులు, వివిధ రకాల టీ ఎల్.ఎం,బొమ్మలు ఆకర్షించాయి. పర్పుల్ కలర్ లో ఉన్న విశిష్టతను విద్యార్థులు వివరించారు. చిన్నారులతో చేయించిన వివిధ రకాల డ్యాన్సులు, ఆటలు, పాటలు, ఫ్యాషన్ షోలతో సందడి చేశారు. వివిధ రకాల ఈవెంట్లు తో విద్యార్థులు ఆకట్టుకున్నారు. డైరెక్టర్ జి.లక్ష్మీ పద్మావతి ఆధ్వర్యంలో కలర్స్ డే వేడుకలను ఉదయం సాయంత్రం వరకు విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి ఉత్సాహంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ సత్యలక్ష్మి, అకడమిక్ ఇంచార్జ్ పద్మావతి, ఉపాధ్యాయ బృందం రూప, దుర్గా ప్రసాద్, షర్మిల, తబసం, ప్రియ, డ్యాన్స్ మాస్టర్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కరీంనగర్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్): కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ఎక్కడ ఉన్నా నిత్య పూజలు అందుకుంటాడు. కొన్నిచోట్ల ప్రతిరోజు పూజలతో పాటు సంవత్సరానికి ఓసారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ ఉంటారు. ఇందులో భాగంగా కరీంనగర్ లోని ప్రధాన కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి గంగుల కమలాకర్ ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ప్రారంభించారు. అప్పటినుంచి ప్రతి ఏడాది ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అయితే బ్రహ్మోత్సవాలకు ఒకప్పటి వైభవం తప్పిందని కొందరు చర్చించుకుంటున్నారు. వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణలో గతంలో కంటే ఇప్పుడు కొన్ని కార్యక్రమాలు నిర్వహించడం లేదని అంటున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ నడిబొడ్డున ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఐదేళ్ల క్రితం బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అంతకుముందు ప్రత్యేక రోజుల్లో, ప్రతి శనివారం ప్రత్యేక పూజలు మాత్రమే నిర్వహించేవారు. కానీ 2022 నుంచి వెంకటేశ్వర స్వామికి ఘనంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలతో స్వామి వారికి పూజలు చేస్తున్నారు. కరీంనగర్ నుంచి కాకుండా వివిధ ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఈ కార్యక్రమాలకు తరలివస్తున్నారు. అయితే గతంలో మంత్రిగా ఉన్న సమయంలో గంగుల కమలాకర్ బ్రహ్మోత్సవాల నిర్మాణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారని కొందరు అంటున్నారు. ప్రతిరోజు జరిగే కార్యక్రమాలకు తాను హాజరై పర్యవేక్షించే వారిని చెబుతున్నారు. అలాగే బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత శోభాయాత్రను ఘనంగా నిర్వహించేవారు. కరీంనగర్ కు పడమర దిశగా ఉన్న మార్కెట్ యార్డ్ గ్రౌండ్ నుంచి స్వామివారి ఆలయం వరకు వివిధ వేషాధారణలు, నృత్యాలు, ఆటపాటల మధ్య స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం ఉండేది. కానీ ఇప్పుడు ఆ కార్యక్రమాన్ని నిర్వహించకపోవడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో ఈ శోభాయాత్ర కార్యక్రమం హైలైట్ గా నిలిచేది. దీనిని చూడడానికి భక్తులు ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చే వారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమానిర్వాహన పై పట్టించుకోవడంలేదని అంటున్నారు. 2025 సంవత్సరంలో ఫిబ్రవరి 6న బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలకు భక్తులు తరలివస్తున్నారు. అయితే గత సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శోభాయాత్రను సాధారణంగా నిర్వహించారు. గతంలో హంగు ఆర్భాటాలతో నిర్వహించిన శోభాయాత్రను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అంటున్నారు. కరీంనగర్ కు చెందిన మంత్రి ఉన్న ప్రభాకర్ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పి ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదని కొందరు అంటున్నారు. అయితే ఈసారి కూడా శోభాయాత్ర ఉంటుందా లేదా అనేది చర్చ నియాంశంగా మారింది.

భగవాన్ శ్రీ దేవ్ నారాయణ్ మందిర్ ప్రాణ ప్రతిష్ట

హాజరైన రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్ మెట్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని కవాడిపల్లి గ్రామంలో సోమవారం శ్రీ వీర రాజస్థాన్ గుజ్జర్ సమాజ్ వారు నిర్మించిన భగవాన్ శ్రీ దేవి నారాయణ మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నేత రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి ఎమ్మెల్యే సచిన్ పైలట్, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొని మందిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ అధ్యక్షులు వి.హనుమంతరావు, ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్ రావు, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ బుర్రరేఖ మహేందర్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్ రెడ్డి మాజీ సర్పంచ్ ఇరుగు చిత్తారితో పాటు నాయకులు, గుజ్జర్ సమాజ్ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే

అశ్వారావుపేట, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్ఛార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నియోజకవర్గ కేంద్రంలో సోమవారం పర్యటించారు. ఇటీవలే జర్నలిస్టు నాగబాబు కుమారుడికి ప్రమాదం జరగడంతో వారి ఇంటికి వెళ్లిన ఆయన ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించారు. స్థానిక క్యాటరింగ్ కాంట్రాక్టర్ ధీరజ మున్నాకు కుమారుడు జన్మించి మరణించాడని తెలియడంతో మాజీ ఎమ్మెల్యే మెచ్చా వారి స్వగృహం వచ్చి కుటుంబాన్ని కలిసి ఓదార్చి ధైర్యం చెప్పారు.ఆంధ్రా ప్రదేశ్ రాష్ట్ర ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారి మడకం వెంకటేశ్వర్లు కుమార్తె వివాహం ఇటీవలే జరగగా వారి స్వగృహం వెళ్లి నవ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. అక్కడ నుండి శ్రీ శ్రీ ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న తోకల తోకల సురేష్ కుమార్తె వాసవి నూతన వస్త్ర బహుకరణ వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్ మూర్తి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంక ప్రసాద్, మోహన్ రెడ్డి, టౌన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ, జజ్జువరపు శ్రీరామ్ మూర్తి, తాళం సూరిబాబు గౌడ్, యువ నాయకులు తగరం హరి, అమీర్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

బచ్చగూడెంలో మల్లన్న జాతర

హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ పుష్ప

పటాన్‌చెరు, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండలం బచ్చగూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, జాతర ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రముఖులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం కార్పోరేటర్ పుష్ప, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట రెడ్డి, అంతిరెడ్డి, బిక్షపతి, రామచందర్, జంగారెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బద్రి చిత్రపటానికి నివాళు లర్పించిన కాంగ్రెస్ నేత

కారేపల్లి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): కారేపల్లి మండలం, తులిస్యా తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ సానుభూతిపరురాలు వాంకుడోత్ బద్రి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. సోమవారం దశదిన కార్యక్రమానికి హాజరై కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, సొసైటీ డైరెక్టర్ బానోత్ హీరలాల్ నాయక్, అజ్మీర ఈర్య నాయక్, చందావత్ వినోద్ నాయక్, వాంకుడోత్ గాంధీ, దసానియా ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటో బోల్తా: విద్యార్థులకు తీవ్ర గాయాలు

డ్రైవర్ పరిస్థితి విషమం

కారేపల్లి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): స్కూల్ ఆటో బోల్తా పడ్డ ఘటన సింగరేణి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎర్రబోడు మాణిక్యరం గ్రామానికి చెందిన విద్యార్థులు కారేపల్లి ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం స్కూల్ నుండి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎర్రబోడు మాణిక్యారాం గ్రామల సమీపంలో స్కూల్ ఆటో చెట్టుని ఢీకొని బోల్తా పడటంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉండడంతో 108 సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదే క్రమంలోఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బాలాపూర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ఆర్థిక ఇబ్బందులతో బెడ్రూమ్ లో ఉన్న ఫ్యాన్ కు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లేల్ గూడ చెందిన పుస్తకాల శ్యాంప్రసాద్(40) అనే వ్యక్తి సోమవారం తను నివాసం ఉంటున్న ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా అతని భార్య ప్రియాంక మీర్పేట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసును నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. మృతుడు గత కొన్ని రోజుల నుండి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడని, సోమవారం తన భార్య దగ్గర తన పిల్లల స్కూల్ ఫీజ్ విషయంలో భార్య దగ్గర బాధపడ్డాడని, భార్య ప్రియాంక ఇంట్లో లేని సమయంలో బెడ్రూంలో నందు గల ఫ్యాన్ కు ఉరి వేసుకొని చనిపోయినట్లుగా తెలిపారు.

వలిగొండ మండలం వలిగొండ పట్టణ కేంద్రంలో రామాలయ చైర్మన్ కుంభం విద్య సాగర్ రెడ్డి జన్మదిన వేడుకలు వంగాల అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువా పూలమాల సత్కరించి కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రావి వేణుగోపాల్ రెడ్డి, కొంపల్లి మహేష్ గౌడ్, మారగోని విష్ణు గౌడ్,చరణ్ కుమార్,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

-వలిగొండ, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్):

ఫ్రీ ఫైనల్ పరీక్షలను తనిఖీ చేసిన ఎంఈఓ

చింతూరు, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): చింతూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ఫ్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్ష లను యం ఈ ఓ లక్ష్మీనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహణ తీరు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అంత మంచి జరిగి ఉన్నత శ్రేణులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థుల ర్యాలీ

చింతూరు, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు జనవరి 16 వ తేదీ నుండి ఫిబ్రవరి15 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా చింతూరులో సోమవారం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ చెల్లారావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎర్రం పేట లోని ఎం వి ఐ కార్యాలయం నుండి చింతూరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టాటా మ్యాజిక్ లు, ఆటోల ఓనర్ లు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ చెల్లారావు మాట్లాడుతూ డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, నిర్దేశించిన స్పీడ్ లోనే వాహనాలు నడపాలని కోరారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదని నడిపితే అలా భారీ జరిమానాలు అధికారులు విధిస్తారని అన్నారు. పరిమితి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించే అలవాటు మానుకోవాలని సూచించారు. లారీలలో ఓవర్ లోడ్ వేయరాదని జరిమానాలు వేయించకుండా పరిమితిలోనే లోడు ఉండేలా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ చెల్లారావు, లారీ ఓనర్స్ అసోసియేషన్, సభ్యులు, మ్యాజిక్ ఓనర్లు, ఆటో ఓనర్లు, కాలేజీ విద్యార్థులు, భారీ ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

అశ్వారావుపేట, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): రెండో సాధారణ స్థానిక ఎన్నికలను కమిషన్ ఎప్పుడు ప్రకటించినా నిర్వహ ణకు సిద్ధంగా ఉన్నామని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన అశ్వారావుపేట మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అందులో ఉండే మౌలిక సదుపాయాలను పరిశీలించారు. దివ్యాంగ ఓటర్లకు ర్యాంపు, మరుగు దొడ్లు, పోలింగ్ రోజుకి విద్యుత్ సరఫరా, తాగునీరు ఉన్నాయా లేవా అనేవి పరిశీలించారు.

బస్సు కోసం రోడ్డుపైనే పడిగాపులు
గన్నేరువరం మండల కేంద్రంలో ప్రయాణికుల కష్టాలు.

గన్నేరువరం, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): గన్నేరువరం మండల కేంద్రంలో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పారువెల్ల, యాస్వాడ, చొక్కారావు పల్లె, మైలారం నాలుగు రోడ్ల ప్రధాన కూడలి వద్ద బస్సు షెల్టర్ కరువైంది. దీంతో ప్రయనికులు ఎండైనా వానైనా రోడ్లపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నాలుగు రోడ్ల ప్రధాన కూడలిలో బస్ షెల్టర్ నిర్మించాలని, అలాగే టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని, ప్రయాణికులు కోరుతున్నారు. మండల కేంద్రంలో బస్టాండు లేకపోవడంతో నిత్యం వందలాది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు వారి బాధ అంతా ఇంతా కాదు. బస్సు కోసం వేచి ఉండాలంటే ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ సామాగ్రితో వేచి ఉండడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. హోటల్ ల వద్ద వేచి ఉంటే వారు పక్కకు వెళ్లాలని చెబుతున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కృత్రిమ మేధతో మానవ తప్పిదాలను అరికట్టవచ్చు

- విమాన భద్రతలో ట్రాఫిక్, మానవ తప్పిదాలే ముఖ్యమైన సమస్యలు
- ఐఐటీ హైదరాబాద్ సాంకేతిక అధికారి డాక్టర్ ఎంవి సత్యానంద్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): విమానయాన భద్రతలో పెరుగుతున్న విమాన ట్రాఫిక్, మానవ తప్పిదాలు, ప్రమాదాల ప్రాబల్యం వంటి ముఖ్యమైన సమస్యలు కీలక భూమిక పోషిస్తున్నాయని, వాటిని అధిగమించేలా మనం సాంకేతికను అభివృద్ధి చేసుకోవాలని ఐఐటీ హైదరాబాదులోని టిహాన్ లో విశిష్ట సాంకేతిక అధికారి డాక్టర్ వెంకట సత్యానంద్ ముట్నూరి అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఏరోస్పేస్ విభాగం ఆధ్వర్యంలో 'ఎయిర్ క్రాఫ్ట్ స్ట్రక్చరల్ సిస్టమ్ హెల్త్ మేనేజ్మెంట్, అడ్వాన్స్ డ్ ఎయిర్ మొబిలిటీ' అనే అంశంపై సోమవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. తక్కువ, అధిక ఎత్తులో ఉన్న ఎయిర్ స్పేస్ ఆపరేషన్ లకు సంబంధించిన డయాగ్నస్టిక్స్, ప్రోగ్నో స్టిక్స్ పద్ధతులపై విలువైన అంతర్దృష్టులను అదించారు. ఆయా సవాళ్లను అధిగమించడానికి వినూత్న పరిష్కారాల అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఎయిర్ క్రాఫ్ట్ స్ట్రక్చరల్ హెల్త్ మేనేజ్మెంట్, ఎయిర్ క్రాఫ్ట్ సిస్టమ్ హెల్త్ మేనేజ్మెంట్, ఎయిర్ ట్రాఫిక్, అర్బన్ ఎయిర్ మొబిలిటీ, అడ్వాన్స్ డ్ ఎయిర్ మొబిలిటీ వంటి కీలక రంగాలను డాక్టర్ ముట్నూరి విశదీకరించారు. అత్యంత సరళేతర విమానాల అప్సెట్ ప్రవర్తనను సంగ్రహించడం, నిజ సమజంలో ప్రమాద ప్రాంతాలను అంచనా వేయడం వంటి సమర్థవంతమైన ఎయిర్ ట్రాఫిక్ నిర్వహణకు చాలా అవసరమని ఆయన స్పష్టీకరించారు. విజయవాడలో ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదలు, అందులో డ్రోన్లు పోషించిన పాత్ర, వాటి విజయాలు, పరిమితులు, స్వయం ప్రతిపత్తి సాంకేతికతల ప్రభావాన్ని ప్రదర్శించడం వంటి ఆకర్షణీయమైన కేస్ స్టడీలను ఆయన విద్యార్థులతో పంచుకున్నారు. 'డేటా ఉన్నప్పుడు, కృత్రిమ మేధస్సు ఉంటుందని, సమాచార యుగంలో, మీరు ఏ డేటాను ఉత్పత్తి చేయబోతున్నారు, అనే ఆలోచింపజేసే ప్రశ్నతో డాక్టర్ ముట్నూరి తన ఉపన్యాసాన్ని ముగించారు. తొలుత, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ అక్తర్ ఖాన్ అతిథిని స్వాగతించి, ఇతర అధ్యాపకులతో కలిసి సత్కరించారు. డాక్టర్ నికుల్ జాని ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, మాజీ విభాగాధిపతి డాక్టర్ వి.హిమబిందు వందన సమర్పణతో ముగిసింది.

శ్రీశైలంలో సామాన్య భక్తులకే పెద్దపీట

- ప్రతి భక్తునికి సంతృప్తి దర్శన మయ్యేవిధంగా ఏర్పాట్లు
- వైభవంగా మహాశివరాత్రి ఏర్పాట్లు
- జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించిన మంత్రుల బృందం

శ్రీశైలం, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): మహాశివరాత్రి పర్వదిన సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీశైల మహాక్షేత్రానికి విచ్చేసే సామాన్య భక్తులకు పెద్దపీట వేసి తొక్కిసలాట లేకుండా శ్రీ భ్రమరాం బామల్లికార్జున స్వామివార్లను సంతృప్తికరంగా దర్శించుకునేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మంత్రుల బృందం దేవస్థాన అధికారులను, జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం దేవస్థాన అన్న ప్రసాద వితరణ భవన ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, హోం శాఖ మంత్రి వి.అనిత, రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఎస్.పి.అధిరాజ్ సింగ్ రాణా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, ఉత్సవాల అధికారి చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావుతో కలిసి మహాశివరాత్రి ఏర్పాట్లపై విస్తృత సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి తొక్కిసలాటలు లేకుండా శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లదర్శనమయ్యేలా పటిష్ట ప్రణాళిక రూపొందించుకుని ఆ మేరకు వసతులు కల్పించాలని దేవస్థాన అధికారులను, జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు గత సంవత్సరం కంటే ఈ ఏడాది 30 శాతం అధికంగా భక్తులు వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ మేరకు ఏర్పాట్లు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలనువైభవంగా నిర్వహించాలన్నారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. క్యూలైన్లలో వచ్చిన భక్తులకు ఉచిత లడ్డు ప్రసాదం అందజేయాలని దేవస్థానం అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ అంతరాయం లేకుండా పర్యవేక్షించేందుక అవసరమైన మోటార్ వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాదయాత్ర భక్తులకు మార్గమధ్యంలో మంచినీళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి ముందు దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వివరించారు. సోమవారం దేవదాయశాఖ కమీషనర్, రామచంద్రమోహన్, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్.ఎస్.చంద్రశేఖర అజాద్‌లు భక్తుల క్యూలైన్లు, పాగాలంకరణ ఏర్పాట్లు, కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ఒకే మాత్ర: డా.కోటేశ్వరరావు

బెల్లంకొండ, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని చంద్రాజుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు వైద్య అధికారి డాక్టర్ కె.వి.కోటేశ్వరరావు విద్యార్థిని విద్యార్థులకు నులిపురుగుల మాత్ర ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు.ప్రతి ఒక్కరూ విద్యార్థిని విద్యార్థులు హ్యాండ్ వాష్ తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా ఈ నులిపురుగుల వ్యాప్తిని అరికట్టవచ్చు అని తెలియపరిచారు. ఈ మాత్రలు పంపిణీ ప్రతి ఆరు నెలలకి ఒకసారి జరుగుతుందని మన మండలం నందు ప్రతి ఒక్కరు అంగన్వాడి సెంటర్స్, ప్రాథమిక పాఠశాలలు, హై స్కూల్ కాలేజీలు,హాస్టల్స్ ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్నం భోజన అనంతరం మన ఆరోగ్య సిబ్బంది దగ్గరుండి నులిపురుగుల మాత్రలు వేశారు. మండలం నందు ఒకటి నుండి 19 సంవత్సరాల బాల బాలికలను 5592 మందికి గాను 5042 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినారు. మిగిలిన బాల బాలికలు సోమవారం మాస్ ఆఫ్ ప్రోగ్రాం ద్వారా మాత్రలు పంపిణీ చేయబడతాయని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ భాష ఏఎన్ఎం లు పాప, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంచే వరకు సమ్మె విరమించేది లేదు

పశు వైద్య విద్యార్థులు

తిరుపతి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం (ఎస్ వి వి యూ) తిరుపతి విద్యార్థుల నిరవధిక సమ్మె నేడు 8వ రోజుకు చేరుకుంది, రిలే నిరాహార దీక్ష 4వ రోజు కొనసాగుతోంది. వెటర్నరీ విద్యార్థుల స్టైపెండ్‌ను సమానమైన ఇతర వైద్య కోర్సుల స్థాయికి పెంచాలని తమ ప్రధాన డిమాండ్ నెరవేరే వరకు ఈ పోరాటాన్ని నిలిపివేయబోమని విద్యార్థులు స్పష్టంగా తెలియజేశారు. ఈరోజు తమ సమ్మెలో భాగంగా, వెటర్నరీ విద్యార్థులు తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. గతంలో 2022లో, అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు వెటర్నరీ విద్యార్థుల స్టైపెండ్ పెంపుపై హామీ ఇచ్చినప్పటికీ,ఇప్పటివరకు అమలులోకి రాలేదని, 13 సంవత్సరాలుగా యూ జి,విద్యార్థులకు 7వేలు పిజి,విద్యార్థులకు 9 వేలు, పిహెచ్ డి, విద్యార్థులకు 10 వేలు మాత్రమే అందుతోందని తెలియజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మొత్తం సరిపోకుండా విద్యార్థులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. విద్యార్థులు కలెక్టరేట్ కార్యాలయం నుంచి దీక్షా శిబిరానికి బైక్ ర్యాలీగా వచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం యూజి, స్టైపెండ్‌ను 10 వేలు, పిజి, స్టైపెండ్‌ను 12 వేలు పెంచాలని భావిస్తున్నప్పటికీ, ఇది తగినంత కాదని, వెటర్నరీ విద్యార్థుల స్టైపండ్ ఇతర మెడికల్ విద్యార్థులకు సమానంగా డిమాండ్ చేస్తున్నామని విద్యార్థులు తెలిపారు. అలాగే, వెటర్నరీ విద్యను వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో విలీనం చేయాలనే ప్రణాళికను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వెటర్నరీ విద్య పూర్తిగా ప్రత్యేకమైనది. ఇది వైద్య విద్యకు సమానమైన శిక్షణ కలిగిన కోర్సు కావడంతో, ప్రత్యేక విశ్వవిద్యాలయం ఉండటం అనివార్యం. దీనిని వ్యవసాయ కోర్సులతో కలపడం విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ నిరవధిక సమ్మె రాజకీయ కోణం కలిగి లేదని, విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడం లేదని స్పష్టంగా తెలియజేశారు. గత ప్రభుత్వ హామీ ఇప్పటివరకు నెరవేరకపోయినా ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించి, సరైన నిర్ణయం తీసుకుంటుందనే నమ్మకం ఉందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి స్టైపెండ్ పెంపును అమలు చేయాలి. మా డిమాండ్లు నెరవేరే వరకు సమ్మెను విరమించబోమని ఇంకా స్పందన రాకపోతే ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని విద్యార్థి సంఘం వెల్లడించింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేసిన కోమటిరెడ్డి

నల్గొండ, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ప్రముఖ విద్యావేత్త, ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ జాతీయ సలహాదారులు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. గడచిన 35 సంవత్సరాలుగా కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి విద్యారంగంలో విశేష సేవలు అందిస్తూ వస్తున్నారు. ఆయన నామినేషన్ వేయడం పై పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం చివరి రోజు కావడంతో నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థుల హడావుడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి నామినేషన్ పత్రాలను ఎలక్షన్ ఆఫీసర్ కు అందజేశారు.

మోడల్ మార్కెట్ ను సందర్శించిన ఎమ్మెల్యే కోరం

ఇల్లందు, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మోడల్ మార్కెట్ ను సందర్శించి ప్రహరీ గోడ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, చిరు వ్యాపారస్తుల కోసం షెడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించిన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కూరగాయలు విక్రయిస్తూ ఇబ్బందులు పడే వ్యాపారస్తుల కోసం పట్టణంలో అన్ని వసతులతో మోడల్ మార్కెట్ నిర్మించామన్నారు. మార్కెట్ భవనంలోకి కింది ఫ్లోర్లో ఉన్న గదులు కూరగాయల వ్యాపారస్తులకు కేటాయించమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, నియోజకవర్గ నాయకులు మడుగు సాంబమూర్తి, బొల్లా సూర్యం, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మాజీ ఎంపీటీసీ పూణెం సురేందర్, మాజీ సర్పంచ్ రాము, పెండ్యాల రాజు, శివ, ఉల్లింగ సతీష్, మూతి కృష్ణ, మునిసిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కు మిస్టర్ తెలంగాణ అవార్డు

కీసర, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ టాలెంట్ అవార్డు 2025లో భాగంగా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో జరిగిన అవార్డు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డాక్టర్ గంగ మల్లేష్ కు మిస్టర్ తెలంగాణ అవార్డు, తన కుమారుడైన గంగి శివశంకర్కు మిస్టర్ హైదరాబాద్ 2025 అవార్డు గ్రహించడం జరిగిందని అన్నారు. ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ టాలెంట్ 2025 లో భాగంగా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ డాక్టర్ గంగి మల్లేష్ మాట్లాడుతూ ప్రజాసేవలో ఉన్నట్లయితే ఏలాంటి అవార్డులైన అందుతాయని, నిరంతరం ప్రజల కోసం పాటుపడే నాయకుడనని ఆయన తెలిపారు. గతంలో డాక్టరేట్ అవార్డు వచ్చిందని, స్ఫూర్తి బుక్ వరల్డ్ రికార్డులో చోటు దక్కిందని, గతంలో సర్పంచ్ గా సేవలు అందించినందుకు ఉత్తమ గ్రామ సర్పంచ్ గా అవార్డులు గ్రహించడం జరిగిందని ఆయన అన్నారు. ప్రజల కోసం తమ సొంత డబ్బులు ఖర్చు చేసి సేవ చేయడం అంటే అంత సులభమైన పని కాదని, ప్రజా సేవలో ఆయనకు మంచి గుర్తింపు ఉన్న నాయకుడనని అన్నారు. ప్రతినిత్యం పేద ప్రజల బడుగు బలహీన వర్గాల గురించి పోరాటం చేసే నాయకుడని,

ఉన్నతమైన విద్య, వైద్యం ఇలా సేవా కార్యక్రమాలు చేయడం ఆయన నైజం అని అన్నారు. తన కుమారుడైన గంగి శివశంకర్కు మిస్టర్ హైదరాబాద్ 2025 అవార్డు గ్రహించడం జరిగిందని, తనతో పాటే సేవలు చేస్తూ ఉంటాడని, అందుకు అతనిని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. అతను సంఘ సేవకుడే కాక క్రికెట్లో మంచి ప్రావీణ్యం గల వ్యక్తిగా ఎదుగుతున్నాడని, అందులో భాగంగానే మిస్టర్ హైదరాబాద్ అవార్డు గ్రహించడం జరిగిందని మరింత బాధ్యతలు పెంచిందని తెలిపారు. ఈ అవార్డులో రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ అవార్డులను మిస్సెస్ యూనివర్స్ 2022 మోడల్, సృజన చేతుల మీదుగా అందుకోవడం ఎంతో గౌరవ కరమని మాజీ సర్పంచ్ డాక్టర్ గంగి మల్లేష్ అన్నారు. ఈ అవార్డుకు సహకరించిన ప్రతి వ్యక్తికి ప్రతి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ మరింత చురుకైన పాత్రను పోషిస్తానని, తన తుది శ్వాస వరకు ప్రజా సేవలో ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అవార్డులే కాకుండా, ఫ్యాషన్ షోలు నిర్వహించడం జరిగిందని, అవార్డు ప్రధాన ఉత్సవం పుష్పా సినిమా సైడ్ క్యారెక్టర్ జగదీష్ అలియాస్ కేశవ రావడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంకు నిర్మాతలు, డైరెక్టర్లు, నటీనటులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ అవార్డును వంశి, శ్రీనివాస్, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగి సాయి కిషోర్, సాయికిరణ్, సాయి చరణ్, కీర్తి శ్రీనివాస్, గంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పవర్ బోర్ ను ప్రారంభించిన కార్పొరేటర్

అంబర్ పేట, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): అంబర్ పేట డివిజన్ ప్రేమ్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్ బోర్ ను డివిజన్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రేమ్ నగర్ లో మంచినీటి ఎద్దడి విషయమై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సిడిపి నిధులు మంజూరు చేసి పవర్ బోర్ ఏర్పాటు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పాక నర్సింగ్, జలమండలి ఏఈ ప్రదీప్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, లైన్మెన్లు నరసింహ, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, పార్టీ నాయకులు కార్యకర్తలు బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

టి ట్వంటీ పోటీలో విజేతగా నిలిచిన గరీబ్ గైడ్ జట్టు

మ్యాన్ అఫ్ ది మ్యాచ్ గా ప్రశాంత్ కుమార్

ఎల్బీనగర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): హైదరాబాద్ నాగోల్ లో జరిగిన 20-20 క్రికెట్ మ్యాచ్ లో గరీబ్ గైడ్ జట్టు విజయం నమోదు చేసింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్ లో గరీబ్ గైడ్ జట్టు నిర్దేశిత 16 ఓవర్లలో 125 పరుగులు గాను 132 పరుగులు సాధించి ఘన విజయం నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న హైకోర్టు జట్టు 16 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 125 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ ఎంచుకున్న గరీబ్ గైడ్ 11.3 ఓవర్లలో 132 పరుగుల విజయాన్ని నమోదు చేసింది. కాగా విన్నర్స్ కు డాక్టర్ ఏ.బ్రహ్మానందం మెమోరియల్ ట్రస్ట్ తరఫున ఏ శ్రీనివాసమూర్తి మెడల్స్ మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా విన్నర్స్ టీం విజేత కెప్టెన్ డాక్టర్ డివి రావు మాట్లాడుతూ ఈ గెలుపు సమిష్టి కృషికి దక్కిన విజయమన్నారు. ప్రత్యర్థి జట్టు కెప్టెన్ సునీల్ గౌడ్ మాట్లాడుతూ గరీబ్ గైడ్ జట్టుతో తలపడటం ఆనందంగా ఉందన్నారు. గరీబ్ గైడ్ టీమ్ సభ్యుడు ప్రశాంత్ కుమార్ మ్యాన్ అఫ్ ది మ్యాచ్ గా ఎంపిక అయ్యారు. ప్రత్యేక అవార్డు అందుకున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం

బెల్లంకొండ, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి 29 వార్షిక కళ్యాణ మహోత్సవం ఆలయ ప్రధాన అర్చకులు పలకలూరి శివా చారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని మాచాయపాలెం గ్రామం వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయం వద్ద 29 వ వార్షిక కళ్యాణ మహోత్సవం సోమవారం నిర్వహించారు. ఆలయ వేద పండితులు మంత్రోచ్చారణతో సుప్రభాత సేవ, నవగ్రహ రుద్ర హోమం, గ్రామ పాడిపంట, శిశు సమృద్ధి కోసం హోమం, గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తులు కన్నుల విందుగా తిలకించారు. మహా నివేదన మంత్రపుష్పంతో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కళ్యాణ మహోత్సవంలో గ్రామ పెద్దలు,ప్రజల సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించి గ్రామస్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచి రామ బ్రహ్మచారి, ఆలయ ధర్మకర్త పలకలూరి చిన్న బ్రహ్మచారి గ్రామస్తులు పాల్గొన్నారు. -

ఇథనాల్ కంపెనీ అనుమతులు రద్దు చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్



బెజ్జంకి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): మండలంలోని గుగ్గిళ్ళ, పోతారం గ్రామ శివారులలో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీల అనుమతులు రద్దు చేయాలని రాష్ట్ర సెక్రటేరియట్ లో ప్రిన్సిపల్ సెక్రటరీ హమ్మద్ నదీమ్ ని కలిసి వినతి పత్రం అందజేసిన సిపిఎం పార్టీ నాయకులు, ఈ సందర్భంగా తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీ ప్రజలు నివసిస్తున్న ఇండ్లకు అతి దగ్గరలో నిర్మిస్తున్నందున ఈ కంపెనీలు వెదజల్లే విశవాయువుల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు కలుగుతుంది. ఈ కంపెనీలు విడుదల చేసే వ్యర్థాలు భూమిలో కలిసి భూగర్భ జలాలు కలుషితమై త్రాగునీరు సాగునీరు విషయంగా మారి ప్రజలకు, పశువులకు,పంటలకు హాని కలిగే ప్రమాదం ఉంది, ఇథానల్ తయారు చేసే క్రమంలో విడుదల అయ్యే విషవాయువులు వ్యర్థాల, మూలాన అతి సమీపంలో ప్రజలు నివసిస్తున్నందున వారికి అనారోగ్య సమస్యలు గురై ప్రాణాలు ముప్పు కలుగుతున్నందున వెంటనే ఇథానల్ కంపెనీ అనుమతులను రద్దుచేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సంఘ ఎల్లయ్య పాల్గొన్నారు.

సాంప్రదాయ నాట్య కళలకు ప్రోత్సాహం



రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు

గోకవరం, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): గాయత్రి నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం అనం కళాకేంద్రంలో ఆదివారం జరిగిన నాట్య కళాతరంగిణి-5 నృత్యోత్సవం కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. తొలుత ఆయనకు నిర్వాహకులు, విద్యార్థులు పూలమాలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. నాట్య కళాతరంగిణి -5 నృత్యోత్సవం కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు లక్షా 30 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంప్రదాయ నాట్య కళలకు ప్రోత్సాహం అందిస్తానన్నారు. రాజమహేంద్రవరం కళాకారులకు పెట్టింది పేరన్నారు. సాంప్రదాయా నృత్యలను ప్రోత్సహించాలనే సంకల్పంతో గోకవరం గ్రామంలో కళాభారతి అనే డాన్స్ కళాశాలను నిర్వహిస్తూ, అతి తక్కువ ఫీజులతో విద్యార్థులకు నేర్పించడం జరుగుతుందన్నారు. తల్లి,దండ్రులు విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, వారు ఏం కావాలనుకుంటున్నారో ఆ విధంగా తయారు చేయాలని సూచించారు. ముందు, ముందు గాయత్రి నృత్య కళానికేతన్ నిర్వాహకులతో కలిసి నడుస్తూ నాట్య కళలపై మక్కువ, ప్రతిభ ఉండి ఆర్థిక పరిస్థితుల వల్ల డ్యాన్సులు నేర్చుకోలేకపోతున్న పేద విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథ రావు శర్మ, కట్టా కళ్యాణ్, దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, బీజేపీ దళిత యువత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానించిన హెల్పింగ్ హాండ్స్

మహేశ్వరం ఫిబ్రవరి 19 (నిఘా న్యూస్): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం జైత్వరాం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బదిలీపై వెళుతున్న పుష్ప, పుష్పలత ,అభినవ్ ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడుకోలు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.. వారికి, గ్రామ ప్రజలకు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ చైర్మన్ జె శ్రీను మాట్లాడుతూ చలికాలంలో ముసలి వాళ్లకు దుప్పట్లు పంపిణీ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నోట్ బుక్స్, ఎక్జామ్ పాడ్స్, పెన్సిల్స్ పంపిణీ చేశామన్నారు. పేద వారికి కావాల్సిన అవసరం అయిన వస్తువులు అందించడంలో ముందుంటామని తెలిపారు. పాఠశాల ముందు వాహనాలు స్పీడ్ గా వెళ్తుతున్నాయని, విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందని హెడ్ మాస్టర్ మా దృష్టికి తీసుకరాగా వెంటనే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పీడ్ బ్రేకర్స్ నిర్మించామన్నారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ఎక్కడ ఉన్నా కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలన్నారు. ఇక్కడ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి మంచి పేరు తెచ్చుకున్నారో వెళ్లిన చోట కూడా విద్యార్థులకు జ్ఞానాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఈ ఓ నరసింహ, హెడ్ మాస్టర్ వి.అంజయ్య, అన్ని యూనియన్ల మండల అధ్యక్ష కార్యదర్శులు, రాజు రవి, రాములు రాజశేఖర్, దెబ్బడగూడ ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి, పులిమామిడి ప్రధానోపాధ్యాయులు పద్మ , కందుకూరు ఎమ్ ఆర్ సి సిబ్బంది వెంకటేశ్ సురేష్, జైత్వరం ప్రధానోపాధ్యాయులు రమేష్ రెడ్డి, అధ్యాపక బృందం నారాయణ మహేష్ అంగన్వాడి ఉపాధ్యాయురాలు సుమతి హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీను, ఉపాధ్యక్షులు జె.రాజు సభ్యులు మహేష్, నవీన్, కార్తీక్, వేణు, విష్ణు, యాదగిరి, మహేష్ వంశి, గ్రామ పెద్దలు, మాజీ ఎంపీటీసీ పర్వతాలు యాదవ్, మాజీ ఉప్ప సర్పంచ్ చంద్ర రెడ్డి గ్రామ పెద్దలు చల్లా శేఖర్ రెడ్డి గ్రామ ప్రజలు, యువజన సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్ ఫోన్ వాడకం తగ్గించాలి

విద్యార్థులకు కంటి అద్దాలు, నులిపురుగుల నివారణ మాత్రలు అందజేత

పలమనేరు, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి చేతుల మీదుగా పలువురు విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాల పంపిణీ చేశారు. జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలిక ఉన్నత పాఠశాల మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలలో ఈ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ పెట్టగలరని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా కంటిచూపు సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు సెల్ఫోన్ వాడకంతో కంటి చూపును త్వరగా కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున సెల్ ఫోన్ వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. అనంతరం కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పలువురు విద్యార్థినిలకు ఆయన కంటి అద్దాలను పంపిణీ చేశారు. నులిపురుగు నివారణ మాత్రల పంపిణి నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నులి పురుగు నివారణ మాత్రలైన ఆల్బెండజోల్ టాబ్లెట్లను ఈ సందర్భంగా ఆయన విద్యార్థినీలకు పంపిణీ చేశారు. అంతకుముందు నులిపురుగులతో తలెత్తే ఆరోగ్య సమస్యలపై అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక విద్యార్థిని తప్పనిసరిగా ఆల్బెండజోల్ టాబ్లెట్లను తీసుకోవాలని ఎమ్మెల్యే విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో పలమనేర్ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి.బాలాజీ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అర్పిత, ఎంఈఓ బాలసుబ్రమణ్యం. బాలిగోన్నత పాఠశాల హెచ్ఎం లత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, పీ.ఎం. ఓ.ఓ మధు, ఎం.పి.హెచ్.ఈ.ఓ జయశంకర్ టీడీపీ నాయకులు కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్,నాగరాజు, శ్రీధర్, కిరణ్, బీ ఆర్ సీ కుమార్, సుధాకర్, శంకరప్ప తదితరులు ఉన్నారు.

బంటి కుటుంబాన్ని పరామర్శించిన రాజేష్

సూర్యాపేట, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): సూర్యాపేట జిల్లా సూర్యాపేట పట్టణ కేంద్రంలో గత పది రోజుల క్రితం మరణించిన మాలబంటి కుటుంబ సభ్యులను సమతా సైనిక్ దళ్ నేత అప్పులో ఉన్న సమాజానికి దశాదిశా సూచిస్తూ చైతన్య పరుస్తున్న రేంజర్ల రాజేష్ వారి కుటుంబానికి ధైర్యం చెప్పి మేమున్నామని ఖచ్చితంగా హంతకులను కఠినంగా శిక్ష పడే వరకు పోరాటం చేస్తామని ప్రకటించారు.

దళిత ఎమ్మెల్సీ అభ్యర్థి వాహనంపై దాడి

ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి అనుచరుల వీరంగం

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

కరీంనగర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ఆల్ఫోర్ట్ సంస్థల అధినేత పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్ ప్రక్రియ జరుగుతున్న సమయంలో అనుచర గణం దాడికి తెరలేపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్ వాహనంపై దాడి చేయడం దుమారం లేపింది వాహనాన్ని చుట్టుముట్టి బూతులు తిడుతూ దాడికి పాల్పడంతో భయాందోళనకు గురైన సదురు అభ్యర్థి కార్ లాక్ చేసుకోగా డోర్ తెరవరా అంటూ విరంగం సృష్టించారు. అయితే తనపై జరిగిన దాడిపై శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తుంది ఎన్నికల కమిషన్ సైతం ఆశ్రయిస్తామని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు ఈ ఘటనపై దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. నామినేషన్ రోజే ఇలా రౌడిజం చేస్తే గెలిస్తే ఇంకింత రెచ్చిపోతారని మాలల పరిరక్షణ వేదిక రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అపర్ణ ఆందోళన వ్యక్తం చేశారు. నరేందర్ రెడ్డి అనుచరుల దౌర్జన్యం పై ఎస్సీ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని వినతి

బాలాపూర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో పెంచిన ఇంటి పన్నులు వెంటనే తగ్గించాలని, వార్షిక అద్దె విలువ ఆధారంగా పన్నులు విధించాలని కార్పొరేషన్ పరిధిలోని 36 కాలనీల సంఘాల నాయకులు మీర్పేట్ మున్సిపల్ కమీషనర్ జ్ఞానేశ్వర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ లోని అన్ని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు జిల్లెల్ గూడ కాలనీల ఫెడరేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సెక్రటరీ వంటేరు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సమావేశమై పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కమిషనర్వినతిపత్రం ఇవ్వాలని తీర్మానించినట్టుగా తెలిపారు. జీ హెచ్ఏంసీ,బడంగ్పేట్ మున్సిపాలిటీలో అనుసరిస్తున్న పన్నుల విధానాన్ని మీర్పేట్ కార్పొరేషన్ లో అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణలో నేను సైతం

పాఠశాల విద్యార్థులకు అంతర్జాతీయ ఆన్ లైన్ చిత్రలేఖన పోటీ

దరఖాస్తు చివరి తేదీ మార్చి 15

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): పర్యావరణ పరిరక్షణ పట్ల బాలల్లో మరింత అవగాహన, బాధ్యత పెంచేందుకు ప్రముఖ పర్యావరణ పరిరక్షణ సంస్థ ఈపీడీసీ (ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్) పాఠశాల స్థాయి విద్యార్థులకు ఆన్లైన్ చిత్రలేఖన పోటీ నిర్వహిస్తోంది. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం (ఫిబ్రవరి 2), ప్రపంచవన్యప్రాణుల దినోత్సవం (మార్చి 3), ప్రపంచ నీటి దినోత్సవం (మార్చి 22) సందర్భాలను పురస్కరించుకొని ఈ పోటీ నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్సీ హెచ్ రంగయ్య పేర్కొన్నారు. ఈ పోటీ 2 విభాగాల్లో జరుగుతుందని, 13 ఏళ్ళలోపు విద్యార్థులు జూనియర్, 17 ఏళ్ళ లోపు సీనియర్ విభాగంలో బొమ్మలు వేయాలని,కుటుంబ సభ్యుల సహకారంతో ఇంటివద్దే చిత్రాన్ని గీసి పూర్తి వివరాలతో ఈపీడీసీ వెబ్ సెట్ లో అప్లోడ్ చెయ్యాలని ఆయన సూచించారు. పెయింటింగ్ పంపిన 24గంటల్లో విద్యార్థి గీసిన చిత్రం, తన పాసుపోర్టు సైజు ఫోటోతో కూడిన "పార్టిసిపేషన్ సర్టిఫికెట్" ఆన్లైన్ లో విద్యార్థికి పంపబడుతుందని తెలిపారు. విజేతలను ఎంపిక చేసి మార్చి 22 న నగదు బహుమతి, 'పర్యావరణ బాల వీర సైనిక అవార్డు' ప్రత్యేక సర్టిఫికెట్ ప్రదానం చేయబడుతుందని,తర్వాత పోటీలో పాల్గొన్న విద్యార్థుల చిత్రాలతో ఏప్రియల్-22 (ధరిత్రి దినోత్సవం) 'బాలల పెయింటింగ్ ఎగ్జిబిషన్' ఏర్పాటు చేయబడు తుందన్నారు.కాగా విజేతలకు 5వేలు మొదటి బహుమతి, 3వేలు రెండవ బహుమతి, 2వేల రూపాయలు మూడవ బహుమతి, మరో 20 మంది విద్యార్థులకు కాంసొలేషన్ బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు.

శ్రీశైలం సమీపంలోని సున్నిపెంట ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజలు, చెంచు గిరిజనుల నుండి వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శివప్రసాద్, ఇతర జిల్లాధికారులు పాల్గొన్నారు.

– శ్రీశైలం, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్):

నేడు రైతులతో శాస్త్రవేత్తల వీడియో కాన్ఫరెన్స్

వ్యవసాయ అధికారి ప్రమోద్ కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి10(నిఘా న్యూస్): నియోజకవర్గంలోని ధర్మారం మండలంలో జీవన ఎరువుల ప్రాముఖ్యతపై మంగళవారం రైతులకు బొట్లవనపర్తి గ్రామంలోని రైతు వేదికలో అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం 9:30 గంటలకు హైదరాబాద్ నుండి శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నదాతలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు.కావున మండలంలోని రైతులు సకాలంలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు. అవగాహన కార్యక్రమంలో రైతులు అందరూ పాల్గొని మెలకువలు నేర్చుకోవాలని కోరారు.

దివ్యాంగ క్రికెటర్లను ప్రోత్సహిస్తాం

ఇంటర్ జోనల్ టీ20 టోర్నీ ప్రారంభించిన జగన్‌మోహన్ రావు



ఉప్పల్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): దివ్యాంగుల ఇంటర్ జోనల్ టీ20 టోర్నమెంట్‌ను టీమిండియా క్రికెటర్ తిలక్ వర్మతో కలిసి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ప్రారంభించారు.సోమవారం ఉప్పల్ స్టేడియంలో ప్రారంభమైన ఈ టోర్నీలో మొత్తం ఐదు జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ హెచ్‌సీఏ తరఫున దివ్యాంగ క్రికెటర్లను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. తాము మిగిలిన వారిలానే క్రికెట్ ఆడగలమని నిరూపించడానికి ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్క దివ్యాంగ క్రికెటర్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. దివ్యాంగ క్రికెటర్ల కోసం కూడా ఐపీఎల్ తరహాలో ఒక లీగ్‌ను నిర్వహించే ఆలోచనను చేయాలని డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఏసీహెచ్ అధ్యక్షుడు సురేందర్ అగర్వాల్, హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి జాన్ మనోజ్, మాజీ ఉపాధ్యక్షుడు మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలు చూపించినా...

పార్కు జలాల కబ్జాను అడ్డుకోరా..?

- కోట్ల రూపాయలు విలువచేసే పార్కులు, ఓపెన్ స్థలాలను కాపాడండి
- ప్రభుత్వ భవనాలకు 100 ఫీట్ల సెట్ బ్యాక్
- ప్రైవేటు నిర్మాణాలకు 150 ఫీట్ల సెట్ బ్యాక్ ఎందుకు
- బడంగ్ పేట్ బీజేపీ మాజీ అధ్యక్షులు చెరుకుపల్లి

బాలాపూర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని పలు డివిజన్లలో కబ్జా కోరల్లో ఉన్న పార్కు, ఓపెన్ స్థలాలను కాపాడాలని బడంగ్ పేట్ కార్పొరేషన్ బీజేపీ పార్టీ మాజీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి పత్రికాముఖంగా మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కోరారు. సోమవారం బడంగ్పేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు ఆర్ రామకృష్ణారెడ్డి, రామిడి వీర కర్ణరెడ్డి లతో కలిసి ఆయన నాదర్గుల్ లోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేషన్ లోని వివిధ డివిజన్లలో పార్కులు, ఓపెన్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, అధికారులకు రుజువులతో సహా ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా చర్యలు తీసుకోకుండా బుట్టదాఖలు చేస్తున్నారని ఆయన అధికారులపై మండిపడ్డారు. మున్సిపల్ రికార్డుల ప్రకారం ఓపెన్ స్థలాలు, పార్కు స్థలాలుగా ఉన్న వాటిని కూడా ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. 31డివిజన్ మున్సిపల్ కాలనీ లేఅవుట్ లో 5 వేల ఒక వంద గజాలు, బాలాజీ నగర్ లేఔట్ లో 400 గజాలు, 31 డివిజన్ ఎం సి ఆర్ కాలనీలో 2 వేల గజాలు, 23వ డివిజన్ మారుతి నగర్ లేఔట్ 2వేల 200 గజాలు, 19వ డివిజన్ గాయత్రి హిల్స్ లేఔట్‌లో 400 గజాలు, 18వ డివిజన్‌లో 1600 గజాలు, సుమారు 11,500 గజాల పార్కు స్థలాలను కొందరు స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పేరుపొందిన వ్యాపారులు ఆక్రమించుకొని అడ్డదారిలో,అక్రమ పద్ధతిన ఇంటి నిర్మాణ అనుమతులు పొంది కొందరు అధికారుల అండదండలతో నిర్మాణాలు చేపట్టారని అన్నారు. ఇట్టి విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుల స్పందించడం లేదని ఇటీవల మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. అలాగే కార్పొరేషన్ లో అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, ఎస్ఎన్డిపి నాలా పనులు మల్లారెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద నాలా ఆక్రమణకు గురైన కారణంగా ఎగువ ప్రాంతం నుండి మురికి నీళ్లు వర్షపు నీళ్లు దిగువ ప్రాంతానికి పోకుండా అక్రమ కట్టడాలు నిర్మించినందువల్ల ఏడాదికాలంగా పనులు పూర్తిగా నిలిచిపోయాయని అన్నారు. గత ప్రభుత్వాలు విధించిన జోన్ల కారణంగా ఫ్లాట్ల యజమానుదారులు ఇంటి నిర్మాణం చేసుకోవడానికి వీలు లేకుండా పోయిందని అదే అదునుగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు లంచాలు చెల్లించి ఇంటి నిర్మాణాలు చేసుకుంటూ చేసుకోవడంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతుందని అన్నారు. ఇటీవల నిర్మించిన మున్సిపల్ కార్యాలయం, జిల్లా గ్రంథాలయ భవనం, కార్పొరేషన్ క్రీడా ప్రాంగణం, ప్రజా మరుగుదొడ్లు 100 అడుగుల సెట్ బ్యాక్ ప్లాన్ తో నిర్మించారాణి, కానీ రోడ్డు ఇరువైపులా ఉన్న ఫ్లాట్ల యజమానులు నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకుంటే మున్సిపల్ అధికారులు హెచ్ ఎండీఏ అధికారులు మాత్రం సదరు రోడ్డు 150 అడుగులు ఉందని అనుమతులు నిరాకరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ భవనాలకు ఒక నిబంధన ప్రైవేటు భవనాలకు మరొక నిబంధన అంటూ స్థానికంగా ఉన్న ఫ్లాట్ యజమానులు అక్రమ పద్ధతిన మాజీ ప్రజా ప్రతినిధులు, పాత అధికారుల సంతకాలతో నిర్మాణ అనుమతులు పొందినట్లుగా చూపిస్తూ నిర్మాణాలు చేపట్టి డోర్ నెంబర్లు పొంది ప్రభుత్వ ఖజానాకు లక్షల్లో గండి కొడుతున్నారని పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో నిధులు లేకపోయినా గత కౌన్సిల్లో కోట్లాది రూపాయల పనులను ఏజెండాలో పొందుపరిచి, కౌన్సిల్ అనుమతి పొంది, టెక్నికల్ అనుమతులు రాకుండానే టెండర్ ప్రక్రియ పూర్తికాకుండానే ఇష్టానుసారంగా సంబంధిత కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిన పనులను అప్పగిస్తున్నారని, సదరు కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకం పనులు చేస్తున్నారన్నారని ఆరోపించారు. అయితే గత ప్రభుత్వంలో 50 కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు విడుదల చేసినా ప్రస్తుత ప్రభుత్వం అటువంటి నిధులను విడుదల చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటుందని ఎమ్మెల్యే అంటున్నారని కానీ అభివృద్ధి తర్వాతనైనా స్థానికంగా వచ్చే పన్నులతో చేసుకోవచ్చని, కానీ కార్పొరేషన్ లో ఉన్న సుమారు 40 కోట్ల రూపాయల విలువ చేసే పార్కులు, ఓపెన్ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తర్రే మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

పైపులు వేసి పదేళ్లయినా నీటిని సరఫరా చేయరా

- యాదవుల కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించండి
- మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్ వెంటనే చర్యలు చేపట్టాలి
- మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ డిమాండ్

భువనగిరి, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): భువనగిరి మున్సిపల్ 8వ వార్డు లందగుట్ట యాదవుల కాలనీలో నీటి సమస్యపై మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ మాజీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్, డివిజనల్ ఇంజనీర్ అధికారులను కలిసి సమస్యను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల జిల్లా కేంద్రంలో ఉండి కూడా మంచి నీటిని మున్సిపల్ వారు సప్లై ఇవ్వక పోవడంవల్ల త్రాగునీటికి నోచుకోని ప్రజలు ఈ ఆధునిక సమాజంలో ఉండడం పాలకులు సిగ్గుపడాలి. గత పది సంవత్సరాల కాలంలో ఇక్కడి ప్రజలు బోరు నీళ్లు, ట్యాంకర్లు బావుల కాడ నీళ్లతో జీవనం కొనసాగిస్తూన్నారని, మున్సిపల్ పాలకులు అధికారుల నిర్లక్ష్యం వల్ల సరైన ప్రణాళిక లేకపోవడం విచారకరమన్నారు. వేసవి కాలం ప్రారంభమవడం వల్ల ఉన్న ఒక్క బోరు కూడా నీటి ప్రవాహం తగ్గి అక్కడ నివాసమున్న జనాభా కు సరిపోకపోవడం వల్ల గతంలో మా పాలకవర్గంలో కృష్ణ మంచినీటి పైపులను వేసినప్పటికి గత పది సంవత్సరాల పాలకవర్గంలో పైప్ లైన్ ను అక్కడకు కనెక్షన్ ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు ఊరు చివర్లో ఉన్న కాలనీలకు గతంలో చేసిన మంచినీటి పైపు లైన్లకు అవకాశం ఉన్న ప్రతీచోట కనెక్షన్స్ కలిపి మంచినీటి పునరుద్ధరనకు తక్షణ చర్యలు చేపట్టాలని, ఎన్నికల కోడ్ ముగిసేవరకు తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా అలాగే కోడ్ ముగిశాక సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కడారి పర్వతాలు, కడారి వీరేశం, మోహన్ రెడ్డి, కడారి యాదమ్మ,కడారి విజయ కడారి రూపమ్మ,కడారి లక్ష్మి,కడారి పద్మ,శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రంగరాజన్ పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ఫెడరేషన్ ఆఫ్ ఆల్ బ్రాహ్మిణ్ అసోసియోషన్ వర్కింగ్ ప్రసిడెంట్ ఒగిరాల రమేష్

రామంతాపూర్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): చిలుకూరి బాలాజీ వెంకటేశ్వరస్వామి పూజారి ప్రొఫెసర్ రంగరాజన్‌పై దాడి చేసిన వారిని ప్రభుత్వం వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ బ్రాహ్మిణ్ అసోసియోషన్ వర్కింగ్ ప్రసిడెంట్ న్యాయవాది ఒగిరాల రమేశ్, ప్రధాన కార్యదర్శి గంగు నర్సింహ్మమూర్తి, అర్చక సంఘం ప్రతినిధి భాస్కర భట్ల రామశర్మ పేర్కొన్నారు. రంగరాజన్ పై దాడి జరిగిన విషయం తెలుసుకున్నవారు పలువురుతో కలిసి చిలుకూరిలో సోమవారం పరామర్శించి దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం వారు మాట్లాడుతూ చట్టాన్ని చేతులోకి తీసుకొని దుండగులు ఆయన ఇంట్లోకి ప్రవేశించి అసభ్య పదజాలంలో రంగరాజన్‌ను దూషించడం అమానుషమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలన్నారు. రంగరాజన్‌కు పూర్తి మద్దతు తెలుపుచున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న బ్రాహ్మణ సంఘాలు వెంటనే స్పందించి ఆయన కు మద్దతు ప్రకటించాలన్నారు. కొంత మంది మతోన్మాదులు హిందు ధర్మంపై చేస్తున్న కుట్రలను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబర్ పేట ఫ్లైఓవర్ ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటాం

- ఇచ్చిన మాట ప్రకారం చే నంబర్
- వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మించాలి
- జనసేన, బిజెపి నాయకుల డిమాండ్

అంబర్‌పేట, ఫిబ్రవరి 10(నిఘా న్యూస్): అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణ కాంట్రాక్టర్ ఇచ్చిన మాట ప్రకారం చే నెంబర్ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని పునర్ నిర్మించాలని జనసేన,బిజెపి, నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జనసేన రాష్ట్ర నాయకులు యువ ప్రవీణ్ ముదిరాజ్, లోకేష్, బిజెపి సీనియర్ నాయకుడు బి.వెంకటేశ్వర్ రావు మీడియాతో మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం దేవాలయం చుట్టుపక్కల కాంట్రాక్టర్ భారీ గోతులు తీశాడని, దీనివల్ల దేవాలయం పగుళ్లు తేలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేవాలయ పరిసరాలన్నీ దుమ్ము ధూళి ,మట్టి, రాళ్లతో చెత్తాచెదారంతో నిండిపోయాయని, దీనివల్ల భక్తులు దేవాలయంలోకి ప్రవేశించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఐదేళ్ల క్రితం ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించిన సమయంలో కాంట్రాక్టర్ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని పునర్ నిర్మిస్తానని హామీ ఇచ్చాడని, దీనికోసం పిల్లర్లు సైతం నిర్మించారని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం ఫ్లైఓవర్ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సమయం దగ్గర పడుతున్న కాంట్రాక్టర్ మాత్రం దేవాలయ పునర్నిర్మానంపై కాలయాపన చేస్తూ వస్తున్నాడని నాయకులు ఆరోపించారు. కాంట్రాక్టర్ వెంటనే స్పందించి దేవాలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించాలని, దీనిపై కాంట్రాక్టర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే శ్రీరామనవమి లోగా దేవాలయ పునర్నిర్మాణ పనులను పూర్తి చేయాలని, లేనిపక్షంలో త్వరలో జరగనున్న ఫ్లైఓవర్ ప్రారంభోత్సవాన్ని రామ భక్తులతో కలిసి అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.

స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్‌ను ప్రారంభించిన ఎఫ్ఐఎఫ్ఎస్

భారతదేశ ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌ల కోసం 'స్పోర్ట్స్ ఏఐ ఛాలెంజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): స్పోర్ట్స్ టెక్‌లో భారత దేశాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్(ఎఫ్ఐఎఫ్ఎస్) ఆధ్వర్యంలో డ్రీమ్11 సమర్పనలో స్పోర్ట్స్ ఏఐ ఛాలెంజ్ 'స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్'ను ప్రారంభించినట్లు ఎఫ్ఐఎఫ్ఎస్ డైరెక్టర్ జనరల్ జాయ్ భట్టాచార్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ అధునాతన సాంకేతిక పోటీ డేటాను సమగ్ర పరచడంతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషిన్ లెర్నింగ్(ఎంఎల్) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను క్రీడలకు ఉపయోగించుకోవడానికి నూతన మార్గాలను అన్వేషించే దిశగా అడుగులేస్తుందన్నారు. ఈ గేమ్‌థాన్‌లో ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌ల నుండి విద్యార్థి జట్లు పాల్గొంటాయన్నారు. 'స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్' అనేది ఆవిష్కరణకు ప్రోత్సాహక వేదికగా మారడంతో పాటు భారతదేశాన్ని స్పోర్ట్స్ టెక్నాలజీలో ప్రపంచ నేతగా ఎదగడమే లక్ష్యంగా ముందుకు తీసుకెళ్లన్నుందని పేర్కొన్నారు. ఇతర పూర్తి వివరాలకు వెబ్ సైట్ https://fifsgameathon.in లో సందర్శించాలన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వం లేకున్నా...

ఎమ్మెల్యేగా గెలిపించి పొరపాటు చేశామా..!

- ఎన్నికలకు బీఫామ్ ఇచ్చేది పార్టీ కానీ ప్రభుత్వం కాదు
- దశాబ్దాల పార్టీ నాయకులకు పదవులు వద్దు
- కానీ కుటుంబ సభ్యులకే పదవులు కాంట్రాక్టులు
- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుపై నేతల నిరసనలు

మోత్కూరు, ఫిబ్రవరి10 (నిఘా న్యూస్): రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో బీ ఫామ్ ఇచ్చేది ప్రభుత్వం కాదు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డిసిసి అధ్యక్షులకు ఇస్తే వారు మండలంలోని ముఖ్య నాయకుల సమన్వయంతో పోటీ చేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ తరపున ఇస్తుందని సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వల్లంపట్ల పూర్ణచంద్ర రావు, పైళ్ల సోమిరెడ్డి,వంగాల సత్యనారాయణ, నారగోని అంజయ్య గౌడ్ తెలిపారు. ఆదివారం మోత్కూర్ లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడిన తీరు తుంగతుర్తి కి నేనే బాస్ అని అనడం, దానికి ప్రతి చర్యగా మీరు కేవలం ప్రజా ప్రతినిధివి మాత్రమే అని కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం లేని నిన్ను కాంగ్రెస్ ఎమ్మెల్యే గా గెలిపించిన అసలైన కాంగ్రెస్ కార్యకర్తలమని తెలిపారు. రాష్ట్రంలో పార్టీ వేరు ప్రభుత్వం వేరు అని తెలుసుకోండి.ఎన్నికల్లో బీఫామ్ ఇచ్చేది పార్టీ కానీ ప్రభుత్వం కాదని ఎమ్మెల్యే సంతకం చేస్తే వచ్చే బీఫామ్ చెల్లదని తెలుసుకోవాలన్నారు. ఖబర్దార్ అని హెచ్చరిస్తున్నా పార్టీ సభ్యత్వం లేని మిమ్మల్ని ఎమ్మెల్యే గా గెలిపించిన కార్యకర్తలనా,ప్రజలనా!. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ పథకాలకు ఉన్నతాధికారులు ఉన్నారు. ఇప్పటి వరకు దశాబ్దాల చరిత్రలో ఏ రాజకీయ పార్టీ ప్రజా ప్రతినిధులు కానీ,ప్రస్తుత ప్రభుత్వ కాంగ్రెస్ నాయకులు కానీ నేనే బాసు అంటూ ఖబర్దార్ అని బెదిరించలేదన్నారు. మీ ఏకపక్ష నిర్ణయాలతో నియోజకవర్గంలో విభిన్న స్వరాలుగా విడిపోతుందని తెలిపారు.దశాబ్దాలుగా పార్టీని అంటూ పెట్టుకొని విధేయులుగా పనిచేస్తున్న నాయకులకు పదవులు వద్దు కానీ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయని మీ కుటుంబ సభ్యులకు ఎన్నికల ఇన్చార్జులు, పదవులు, కాంట్రాక్టులా అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చీమలు పెట్టిన పుట్టలో లాగా పాము జోరబడీ విషం కక్కుతున్నారని, ఇకనైనా కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి మార్గాన్ని ఎంచుకొని ప్రతి మండలంలో కో ఆర్డినేషన్ కమిటీ వేసి సమన్వయకర్తలను ఆ కమిటీ బాధ్యులుగా నియమించి రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని కోరుతున్నామన్నారు.

కార్పొరేట్ విద్యా వ్యాపారి...

ఉపాధ్యాయులకు మేలు చేస్తాడా..!

- మరొకరు రియల్ ఎస్టేట్ వ్యాపారం
- వాళ్ళు ఇచ్చేవి తీసుకోండి నిజాయితీకి ఓటు వేయండి
- అట్టహాసంగా కూర రఘోత్తం రెడ్డి నామినేషన్

నిజాంపేట్, ఫిబ్రవరి 10 (నిఘా న్యూస్): ఎస్టియుటిఎస్ బలపరిచిన కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తం రెడ్డి నామినేషన్ మహోత్సవ కార్యక్రమం ఉమ్మడి కరీంనగర్ అదిలాబాద్ ఎనిజామాబాద్–మెదక్ జిల్లాల నుండి విచ్చేసిన ఉపాధ్యాయుల భారీ ర్యాలీ నడుమ నినాదాల హోరులో రఘోత్తం రెడ్డి ముందుకు నడవగా వారి వెంట దాదాపు ఐదు వేలమంది ఉపాధ్యాయులు అనుసరించగా ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించిన అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సైనికుడిగా మారి, గెలుపే లక్ష్యంగా పనిచేస్తూ 15రోజులపాటు ఎమ్మెల్సీ దీక్షను బూనాలని హితబోధ చేశారు. ప్రతి ఉపాధ్యాయుడిని ఇంటింటికి వెళ్లి కలవాలని మీలో నుండి 30 సంవత్సరాలు వృత్తి చేసి వచ్చిన ఉపాధ్యాయుడికి ఓటేయాలని కోరి వారిచే మొదటి (1) ప్రియారిటీ ఓటు వేయించి గెలిపించే బాధ్యత మీ అందరిదని కార్యకర్తలను ఉత్సాహపరిచారు. చివరగా ప్రసంగించిన ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తం రెడ్డి ప్రసంగిస్తూ. 30 సంవత్సరాలపాటు ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు సేవలందిస్తూ ఉద్యోగ నేతగా ఉపాధ్యాయ లోకానికి అందుబాటులో ఉన్నానని, అందరి ఆశీర్వాదంతో గడిచిన ఆరు సంవత్సరాల పాటు శాసనమండలి సభ్యునిగా అనేక సమస్యలు పరిష్కరించానని తెలిపారు. ఉపాధ్యాయుల పక్షాన నిలబడి అనేక సమస్యలు పరిష్కరించిన నన్ను అవమాన పరుస్తూ డబ్బుకు సంఘాన్ని తాకట్టు పెట్టి ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారికి టికెట్ కేటాయించడం చూస్తుంటే ఉపాధ్యాయ కీర్తిని అప్రతిష్ట పాలు చేయడమేనని. భావోద్వేగంతో కంటతడి పెట్టారు. ఇప్పుడు పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులలో ఒకరు రియల్ ఎస్టేట్ వ్యాపారి అయితే మరొకరు కార్పొరేట్ విద్య వ్యాపారి ఇచ్చేవి తీసుకోవాలని కాని విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస రాథోడ్ అలాగే జిల్లా నుంచి 150 మంది ఉపాధ్యాయులు, ఉమ్మడి నాలుగు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com